ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025

ఆటో డ్రైవర్ల సేవలో...కూటమి ప్రభుత్వం



'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకం కింద లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, టీడీపీ నేత పట్టాభి

జిల్లాలో 22,955 మందికి రూ.34.43 కోట్లు విడుదల

- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):
'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకం కింద జిల్లాలో 22,955 మందికి రూ.34.43 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు.

సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 2014-19 ... మిగతా 6వ పేజీలో



గాజువాకలో 'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఫ్లాట్ల ధరలు దిగొచ్చేనా?

జీఎస్టీ శ్లాబు మార్పుతో సిమెంట్ ధర బస్తాకు రూ.30 తగ్గింపు

- అన్ సీజన్‌తో రూ.54 వేలకే లభిస్తున్న స్టీల్
- నిర్మాణ సామగ్రి ధరలు దిగివచ్చినా ఐదు శాతం కంటే ఎక్కువ తగ్గించలేమంటున్న బిల్డర్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
నగరంలో బిల్డర్లు ఫ్లాట్ల ధరలు ఇప్పుడైనా తగ్గిస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని ధరలు విశాఖపట్నంలోనే ఉన్నాయి. సీతమ్మధార, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఫ్లాట్ కొనాలంటే చ.అ. కనీసం రూ.9 వేలు చెబుతున్నారు. ఎండాడలో సైతం చ.అ. రూ.8 వేల నుంచి ప్రారంభమవుతోంది. మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది తదితర ప్రాంతాల్లో రూ.6,500 చెబుతున్నారు. నగరంలో భూమి ధర చదరపు గజం రూ.1.2 లక్షలు ఉంటే మధురవాడ ప్రాంతంలో రూ.80,000 ఉంది. ఆ కారణంగా అక్కడ ఫ్లాట్ల ధరలు కాసింత తక్కువగా ఉన్నాయి.

ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ బాగా తగ్గించాయి. ఆ మేరకు కొనుగోలుదారులకు ప్రయోజనం కల్పించాల్సిన బాధ్యత బిల్డర్లపై ఉంది. అయితే అది కూడా కష్టమేనని బిల్డర్లు పెదవి విరవడం గమనార్హం. సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉండగా దానిని 18 శాతం చేశారు. అంటే పది శాతం తగ్గింది. దీనికి బిల్డర్లు చెబుతున్న భాష్యం వేరేగా ఉంది. సిమెంట్ కంపెనీలు ఇంకా ధరలు తగ్గించలేదని, బస్తాకు ఆరు రూపాయలు మాత్రమే తగ్గించాయని, వారి దగ్గర పాత నిల్వలు అయిపోయి, కొత్త నిల్వలు మార్కెట్‌కు వస్తే అప్పుడు ఆ ధరలు తగ్గుముఖం పడతాయని అంటున్నారు. ఫ్లాట్ల కొనుగోలుదారులకు ఓ ఐదు శాతం వరకు మాత్రమే ధర తగ్గించే అవకాశం ఉందని క్రెడాయ్ ప్రతినిధి ఒకరు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్టీల్‌పై జీఎస్టీ 18 శాతమే కొనసాగుతున్నదని, దానిని తగ్గించలేదని వివరించారు. అందువల్ల ఫ్లాట్ల రేట్లలో ఐదు శాతం కంటే ఎక్కువ తగ్గుదల ఉండకపోవచ్చునని పేర్కొన్నారు.

వాస్తవం వేరుగా ఉంది

మార్కెట్‌ను పరిశీలిస్తే నిర్మాణానికి ప్రధాన ముడి సరకులైన సిమెంట్, స్టీల్ ధరలు బాగా తగ్గుముఖం పట్టాయి. సిమెంట్ ధరలు పది శాతం వరకు తగ్గాయి. క్రెడాయ్ ప్రతినిధులు పేర్కొన్నట్టు బస్తాకు ఆరు రూపాయలు తగ్గిందని చెబుతుండగా, మార్కెట్‌లో మాత్రం పాత రేటుపై రూ.30 తగ్గించి విక్రయిస్తున్నారు. రామ్‌కో సిమెంట్ బస్తా రూ.330 నుంచి రూ.300కి తగ్గింది. నాగార్జున సిమెంట్ బస్తా రూ.345 నుంచి రూ.315కి తగ్గింది. సాగర్ సిమెంట్ రూ.290 నుంచి రూ.260కి, అల్ట్రా టెక్ సిమెంట్ రూ.350 నుంచి రూ.315, మహా సిమెంట్ రూ.285 నుంచి రూ.250కి తగ్గాయి. కొన్ని రకాలు బస్తాకు రూ.35 వరకు ... మిగతా 6వ పేజీలో

ఇంకా పాత ధరలే!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా వాటి ఫలాలు సామాన్యులకు పూర్తిగా అందడం లేదు. ఇంకా పాత రేట్లకే వ్యాపారులు వస్తువులు విక్రయిస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన యంత్రాంగం కార్యాలయాలకే పరిమితం కావడం వల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం సిద్ధించడం లేదు.

సెప్టెంబరు 22 నుంచే జీఎస్టీ తగ్గింపు అమలులోకి వచ్చింది. కానీ చాలామంది వర్తకులు ఇంకా పాత ధరలకే వస్తువులను విక్రయిస్తున్నారు. దీనిపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన లేదు. చిత్తశుద్ధితో ప్రజలకు ప్రయోజనం అందించాలంటే తప్పనిసరిగా ప్రతి దుకాణంలో పాత రేట్లు, కొత్త రేట్లతో బోర్డులు ఏర్పాటుచేయాలి. అప్పుడే ధర ఎంత తగ్గిందనేది కొనుగోలుదారులకు తెలుస్తుంది. ఉదాహరణకు ఒక కిరాణా షాపునకు వెళ్లి టీపొడి కొనుగోలు చేస్తే ఒక బ్రాండ్ ఉత్పత్తిని ఎంఆర్‌పీ కంటే తక్కువకు ఇస్తున్నారు. జీఎస్టీ తగ్గిందని చెబుతున్నారు. అదేషాపులో మరో బ్రాండ్ టీ పౌడర్ కొంటే ఎంఆర్‌పీనే తీసుకుంటున్నారు. రేటు తగ్గించడం



లేదు. జీఎస్టీ తగ్గలేదని చెబుతున్నారు. ఒకే రకమైన ఉత్పత్తిని వేర్వేరు సంస్థలు వేర్వేరు జీఎస్టీ ధరలతో విక్రయిస్తున్నాయి. అధికారులు ఇలాంటి అంశాల జోలికి పోవడం లేదు. కేవలం సమావేశాలు నిర్వహించి, తగ్గిన జీఎస్టీ ధరలు అమలు చేయాలని సూచిస్తున్నారు.

నగర ప్రజలు ఎవరైనా సరే భారీ మొత్తం పెట్టి ఏదైనా కొనుగోలు చేసినప్పుడు బిల్లు పరిశీలించి, వస్తువు ధర, జీఎస్టీ ఎంత పడిందో చూసుకుంటారు. అది కూడా బిల్లు చేతికి ఇచ్చినప్పుడు మాత్రమే. కొన్ని షాపుల్లో మొబైల్ ఫోన్‌కు బిల్లు పంపించామని, చూసుకోవాలని చెబుతున్నారు. వెస్ట్ సైడ్, మ్యాక్స్ తదితర షాపులలో ఇలాగే మొబైల్ బిల్స్ ఇస్తున్నారు. అలాంటివి చూసేంత తీరిక, ఓపిక కొనుగోలుదారులకు ఉండడం లేదు. వందల రూపాయల విలువైన వస్తువులు కొన్నప్పుడు ఎంఆర్‌పీలు చూసుకుంటున్నారే తప్ప వాటిపై జీఎస్టీ ఎంత అనేది ఎవరూ గమనించడం లేదు. ఇదే వ్యాపారులు మోసం చేయడానికి అవకాశం కల్పిస్తోంది.



ధరల పట్టిక లేని ఓ మందుల దుకాణం

వినియోగదారులకు అందని జీఎస్టీ 2.0 ఫలాలు

వ్యాపారుల మాయాజాలం

అధికారుల పర్యవేక్షణ నిల్

- ప్రభుత్వ ప్రచారం వల్ల ప్రయోజనం శూన్యం
- షాపుల్లో ధరల పట్టికలు పెట్టినప్పుడే ఉపయోగం

ఒక్కో దగ్గర ఒక్కోలా...

మెడిసిన్స్ ధరలు కూడా బాగా తగ్గాలి. అయితే కొందరే అమలు చేస్తున్నారు. మరికొందరు పట్టించుకోవడం లేదు. జీఎస్టీ తగ్గిందని బోర్డులు ప్రదర్శించాలని డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆదేశించారు. ఇది ఎలా అమలు అవుతున్నదో తెలుసుకోవడానికి అక్కయ్యపాలెం ... మిగతా 6వ పేజీలో

బాణసంచా అక్రమ నిల్వలపై దాడులు

- భారీగా సరకు స్వాధీనం
- టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు...



స్వాధీనం చేసుకున్న బాణసంచా

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):
బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నగరంలో బాణసంచా అక్రమంగా తయారీ, నిల్వ చేయడంపై సీపీ శంఖబ్రతబాగ్చికి ఫిర్యాదులు అందాయి. అక్రమ నిల్వల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే భారీనష్టం వాటిల్లే అవకాశం ఉండడంతో దాడులు చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోపాలపట్నం, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, ఎంవీపీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురి ఇళ్లతోపాటు గోడౌన్లలో సోదాలు నిర్వహించారు. అక్రమంగా బాణసంచాను నిల్వ ఉంచిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.

జీవీఎంసీలో వెండింగ్ జోన్లు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కారణంగా దుకాణాలను కోల్పోయిన వారికి స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించనున్నారు. ఈ దిశగా కమిషనర్ కేతన్‌గార్గ్ చర్యలను వేగవంతం చేశారు.

నగరంలో రోడ్ల మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు అవకాశం లేక రోడ్డుపై నడవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కొంతమంది రాజకీయ నేతలు, కార్పొరేటర్లు తమ ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసి అద్దెకు ఇచ్చుకుంటున్నారని తరచూ ఫిర్యాదులు అందుతుండడంతో కమిషనర్ కేతన్‌గార్గ్ 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో నగరమంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన సుమారు మూడు వేల దుకాణాలను తొలగించారు. ఈ చర్య ద్వారా దళారులకు చెక్ పెట్టారు. అయితే ఈ క్రమంలో చిరు వర్తకులు కూడా ఉపాధి కోల్పోయారు. అలాంటి వారిని ఆదుకునేందుకు వీలుగా నగరంలో ఎక్కడికక్కడ స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు ఏర్పాటుచేయాలని కమిషనర్ నిర్ణయించారు. దీనికోసం అనువైన స్థలాలను గుర్తించాలని టౌన్‌ప్లానింగ్, యూసీడీ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నగరమంతా సర్వే చేసి ప్రస్తుతం 21 ప్రాంతాల్లో వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలు గుర్తించారు. భీమిలి గంట స్తంభం వద్ద 32 దుకాణాలు, తగరపువలస మీసేవా రోడ్డులో 86, ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ సమీపంలో 66, ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో 58, ఏయూ నార్త్ క్యాంపస్ మద్దిలపాలెం వద్ద 9, శివాజీ పార్కు సర్వీస్ రోడ్డులో 13, ఎల్‌ఐసీ బిల్డింగ్ వద్ద 17, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే రోడ్డులో 13, నరసింహనగర్‌లో 14, ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి పాత కరాస రోడ్డులో 34, ... మిగతా 6వ పేజీలో

ప్రస్తుతం 21 ప్రాంతాల్లో ఏర్పాటు

- 'ఆపరేషన్ లంగ్స్' డ్రైవ్‌లో దుకాణాలు కోల్పోయిన వారికి అవకాశం
- కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఆమోదం
- అర్హులైన వీధి వర్తకుల గుర్తింపు



ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):
విజయదశమికి స్వస్థలాలకు వచ్చి, తిరుగు ప్రయాణమైన వారి కోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం శనివారం 50 ప్రత్యేక సర్వీసులు నడిపింది. షెడ్యూల్ సర్వీసుల కెపాసిటీకి మించి ప్రయాణికుల డిమాండ్ ఉండడంతో ఈ ప్రత్యేక బస్సులు ఆపరేట్ చేసింది. విజయవాడకు 9, హైదరాబాద్‌కు 11, శ్రీకాకుళం జిల్లాకు 18, విజయనగరం జిల్లాకు 18 స్పెషల్ సర్వీసులు నడిపింది. ఆదివారం ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

వలందపేటలో బాణసంచా పేలుడు

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

-6లో

జడ్పీలో రాజకీయం

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయమన్నట్టు వ్యవహరిస్తున్న వైసీపీ సభ్యులు

గందరగోళంగా సర్వసభ్య సమావేశాలు

- ఒక్కొక్క అంశంపై గంటల తరబడి సాగదీత
- కాలం సద్వినియోగంలో సభ్యులు విఫలం
- నాలుగేళ్లలో చర్చకు రాని శాఖలు ఎన్నో

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి)
జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను వైసీపీ సభ్యులు రాజకీయ వేదికలుగా మార్చుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతాల్లో సమస్యలను ప్రస్తావించాల్సిన సభ్యులు కేవలం పార్టీ అజెండానే భుజాన వేసుకుని సమావేశాలను హైజాక్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయమన్నట్టు వ్యవహరిస్తున్నారు. ప్రజలచే ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతం లేదా జిల్లాలో ప్రధాన సమస్యలను సమావేశంలో ప్రస్తావించి అవి పరిష్కారం అయ్యేలా చూడాల్సి ఉంది. కానీ, కొందరు ఆ విషయం వదిలేసి ఒకే అంశంపై లేనిపోని సందేహాలతో గంటలకొద్దీ చర్చ కొనసాగిస్తున్నారు.

ప్రస్తుత జడ్పీ పాలక వర్గం ఏర్పడి గత నెల 23వ తేదీకి నాలుగేళ్లు పూర్తయ్యింది. శనివారం నాటి సమావేశంతో కలిపి ఈ నాలుగేళ్లలో 17 సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. శనివారం సమావేశంలో సభ్యులతో పాటు చైర్‌పర్సన్ కూడా కూడా నేరుగా అధికారులపై విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. సభా వేదిక నుంచే అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌కు ... మిగతా 6వ పేజీలో



శనివారం జడ్పీ సమావేశంలో పోడియం వద్ద బైఠాయించిన వైసీపీ సభ్యులు

ప్రయాణికుల ద్వారా రూ.426 కోట్ల ఆదాయం

- సరకు రవాణా ద్వారా రూ.4,841 కోట్లు
- వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):
వాల్తేరు డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ప్రయాణికుల ద్వారా రూ.426 కోట్ల ఆదాయం సాధించిందని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. అలాగే 39.18 మిలియన్ టన్నుల సరకు రవాణా ద్వారా రూ.4,841 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు చివరి వరకు 121 ప్రత్యేక రైళ్ల ద్వారా 1.5 లక్షల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చామన్నారు. అవి కాకుండా రెగ్యులర్ రైళ్లకు డిమాండ్‌కు అనుగుణంగా 3,300 అదనపు కోచ్‌లు జత చేశామన్నారు. అమృత్ భారత్ పథకం కింద డివిజన్‌లో 15 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని, వాటిలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. బేబీ ఫీడింగ్ సెంటర్లు, ప్రీమియం లాంజ్‌లు వంటివి ఉన్నాయన్నారు. ప్రయాణికులకు భద్రత, రక్షణ పెంచామన్నారు. సీసీ టీవీ కెమెరాల ద్వారా నిఘా పెంచామన్నారు. ఇంకా ఏమి చెప్పారంటే...

- సరకు రవాణాలో రోజువారీలోడింగ్ సామర్థ్యం 10.78 శాతం పెరిగింది.
- కిరండోల్-బచేలీ మార్గంలో ఐరన్‌ఓర్ 12.79 మిలియన్ టన్నులు రవాణా చేశారు. ఇది గతం కంటే ... మిగతా 6వ పేజీలో



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా




ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాకి మహేశ్, నగిరెడ్ల వాసు,

వలందపేటలో బాణసంచా పేలుడు



చిల్ల కనకారెడ్డి

తగరపువలస,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలోని వలంద పేటలో శుక్రవారం రాత్రి బాణసంచా సామగ్రి పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహ కులు శనివారం అమ్మవారి ప్రతిమ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు బాకి మహేశ్, (35), నగిరెడ్ల వాసు (32), చిల్ల కనకారెడ్డి (26)లు శుక్రవారం రాత్రి అమ్మవారి మండపానికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో బాణసంచా తయారీకి సిద్ధమయ్యారు. అనాలోచితంగా ముడి సరకులను కలిపి ఖాళీ బాటిల్‌తో నింపుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘట నలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలో ఉన్న ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో సీఐ తిరుమల రావు, ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. శనివారం క్లూస్ టీమ్ కూడా ఆధారాలు సేకరించింది. కాగా క్షత గాత్రుల్లో మహేశ్ పరిస్థితి విషమంగా ఉంది. మహేశ్, వాసు ప్లంబర్లు గా, కనకారెడ్డి తాపీమేస్త్రీగా పనిచేస్తున్నారు. సీఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

శిథిల భవనం తొలగింపు

మధురవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మధురవాడలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం భవనాన్ని అధికారులు శనివారం తొలగించారు. 40 ఏళ్ల కిందట ఈ భవనాన్ని నిర్మించారు. మధురవాడ, గణేశ్‌నగర్, చంద్రం పాలెం పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే బీసీ, ఎస్సీ ఎస్టీ బాలురకు ఇక్కడ వసతి కల్పించేవారు. నిర్మించిన నాటి నుంచి నిర్వహణ పనులు చేపట్టపోవడంతో భవనం ఆరేళ్ల కిందట శిథిలావ స్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదాలు జరుగుతుండడంతో కొత్తగా మరో వసతి గృహం నిర్మించి విద్యార్థులను అందులోకి తర లించారు. శిథిలమైన భవనాన్ని తొలగించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వివాహిత మృతి

ఆనందపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దిపా లెం జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వివాహిత మృతి చెందింది. కొమ్మాదికి చెందిన కంపా సన్యాసమ్మ (36) శనివారం ఉదయం భోగాపురంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పెద్దిపాలెం వద్ద ఆటో దిగింది. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి వద్ద ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ సహాయంతో స్థానికులు ఆ మె భర్త రామసూరికి సమాచారం అందించారు. ఆయన ఫిర్యాదు మే రకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహా న్ని పోస్టుమార్టం కోసం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రయాణికుల ద్వారా రూ.426 కోట్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

21.69 శాతం అధికం.

- ర్యాక్‌ల టర్న్ అరౌండ్ సామర్థ్యం పెరిగింది. గతంలో రోజుకు 53.8 ర్యాక్‌లకు సరకులు లోడింగ్ కాగా ఇప్పుడు 59.6 ర్యాక్‌లు చేస్తు న్నారు.
- గతంలో ఐరన్‌ఓర్ రవాణా ద్వారా రూ.662.92 కోట్ల ఆదాయం రాగా ఈసారి అది రూ.800 కోట్లకు చేరింది.
- సెప్టెంబరు చివరి నాటికి 1.64 కోట్ల ప్రయాణికులు రైళ్ల ద్వారా గమ్యం చేరారు.
- డివిజన్‌లో నార్కోటిక్ డ్రగ్స్ కేసులు 121 నమోదు చేసి రూ.2.86 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- స్టేషన్ల ఆవరణను దుర్వినియోగం చేసినందుకు 30 వేల మంది పై కేసులు నమోదు చేశారు.
- రైళ్ల పైకి రాళ్లు విసిరే వారికి సంబంధించి గత ఏడాది 28 కేసు లు నమోదు కాగా స్థానిక నాయకులతో చర్చలు జరపడం వల్ల ఈ ఘటనల సంఖ్య ఐదుకు చేరింది.
- పిల్లల అక్రమ రవాణాను నిరోధించి 273 మంది బాలలను, 69 మంది బాలికలను వారి సంబంధీకులకు అప్పగించారు.

ఫ్లాట్ల ధరలు దిగొచ్చేనా ?

... 5వ పేజీ తరువాయి

తగ్గాయి. కానీ బిల్డర్లు తగ్గలేదని చెప్పడం గమనార్హం. ఇక స్టీల్ రేట్లు చూసుకుంటే వైజాగ్ స్టీల్ టన్ను రూ.54 వేలకు దొరుకుతోంది. గతంలో ఇదే స్టీల్ టన్ను రూ.90 వేలు పలికింది. అంటే ఎంత తేడా ఉందో అర్థం చేసుకోవచ్చు. సింహాద్రి స్టీల్ టన్ను రూ.53 వేలకు దొరు కుతోంది. ఈ ప్రయోజనం కొనుగోలుదారులకు అందడం లేదు. ఏదే మైనా స్టీల్, సిమెంట్ ధరలు బాగా తగ్గినందున బిల్డర్లు ఆ మేరకు ఫ్లాట్ల ధరలను తగ్గించాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రేట్లు ఎక్కువైనపుడు ఎలా పెంచుతున్నారో తగ్గినప్పుడు కూడా ఆ ప్రయో జనం కొనుగోలుదారులకు అందిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రా యం వ్యక్తమవుతోంది.

జడ్పీలో రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ఫోన్ చేసి 'జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు రాకపోవడా నికి మీ నిర్లక్ష్యమే కారణం' అంటూ వ్యాఖ్యానించడంతో పలువురు అ ధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలోనే ఉన్న విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రధానంగా కలెక్టర్లకు ప్రభుత్వ కార్యక్రమం తొలి ప్రాధాన్యం, జడ్పీ సమావేశం రెండో ప్రాధాన్యం అంటూ జడ్పీ సమావేశం వాయిదా వేసుకుని ఉం డాల్సిందని పేర్కొనడం గమనార్హం. కాగా అల్లూరి జిల్లా అనంతగిరిలో రెండు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వం లోనే వచ్చాయి. వాటిపై అప్పట్లో మౌనంగా ఉన్న వైసీపీ జడ్పీటీసీ స భ్యులు ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటని సమావేశంలో సభ్యుడొకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే వైసీపీ హయాంలో జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉండేవి. కూటమి వచ్చిన తరువా త అనేక రోడ్లను బాగుచేయించింది. కానీ ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విమర్శలు చేయడంతో రాజకీయ లబ్ధికోసమే ననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక, ఒక్క అంశాన్ని పట్టుకుని గంటల తరబడి సాగదీస్తున్నారు. ఇదే విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనా రాయణ శనివారం ప్రస్తావించి అన్ని అంశాలకు సమయం కేటాయిం చాలన్నారు. సమావేశం మధ్యలో ఆయన వెళ్లిపోయిన తరువాత స మస్యలను పక్కనపెట్టి ప్రొటోకాల్ అంశంపై సభ్యులు చర్చించడం గందరగోళానికి దారితీసింది. ప్రతి అంశానికి నిర్దిష్ట సమయం నిర్ణ యించి చర్చించేలా అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్‌పర్సన్ చూడాలి. గడ చిన నాలుగేళ్లలో అసలు చర్చకు రాని శాఖలే ఎక్కువగా ఉన్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆదేశిస్తారు. దీంతో రోజంతా వారు జడ్పీలో పడిగాపులు కాయాల్సి వ స్తోంది. శనివారం సమావేశాలకు హాజరుకాని అధికారులను జడ్పీ అ ధికారులు ఆగమేఘాలపై పిలిపించారు.

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం చేయూత

- భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాథూర్
- ఆనందపురంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం
- డ్రైవర్లకు చెక్కు అందజేత



ఆటోడ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఆర్‌డీఓ సంగీత్ మాథూర్

ఆనందపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించిందని భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాథూర్ అన్నారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆనందపురం, పద్మనా భం, భీమిలి మండలాల్లో 5892 మంది ఆటో డ్రైవర్లకు ఈ పథకం వర్తి స్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఒక్కొక్క పథకాన్ని అమలు చేస్తూ వస్తుంద న్నారు. స్వశక్తితో ఎదిగే ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం చేయూత అందించే దిశగా ఈ పథకం దోహద పడుతుందని చెప్పారు. పథకం కింద ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ. 15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. అర్హులై ఉండి జాబితాలో పేరు లేకపోతే అధికారులను సంప్ర దించాలని సూచించారు.అనంతరం మూడు మండలాలకు చెందిన 5892 మంది ఆటోడ్రైవర్లకు రూ. 8.83 కోట్ల చెక్కు అందజేశారు. అలాగే ఆటో లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి డీఎల్‌డీఓ నిర్మలా దేవి, ఎస్‌డీసీఎస్ఎస్ ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి, తహశీల్దార్ ఎస్. శ్రీను బాబు, ఎంపీడీఓ జానకి, డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, ఆర్‌టీఓ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యనారాయణ, తర్లువాడ సర్పంచ్ నాయుడు, వేములవలస పీఏసీఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, నాయకులు వానపల్లి ముత్యాలరావు, బలిరెడ్డి మల్లికార్జునరావు, సురాల సత్యవరప్ర సాద్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, మార్కెట్ డైరెక్టర్ రామలక్ష్మి, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, లొడగల రమణ, ఉప్పాడ లక్ష్మణరావు, మహంతి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 పరిధిలో 3690 మంది లబ్ధిదారులు

కొమ్మాది : ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద జోన్-2 పరిధిలో 3690 మంది లబ్ధిదారులు ఉన్నట్టు జడ్పీ కనక మహాలక్ష్మి తెలిపారు. 5వ వార్డు లో 688 మంది, 6వ వార్డులో 521, 7వ వార్డులో 438, 8వ వార్డులో 307, 9వ వార్డులో 197, 10వ వార్డులో 236, 11వ వార్డులో 404, 12వ వార్డులో 368, 13వ వార్డులో 531 మంది ఉన్నట్టు చెప్పారు.

పద్మనాభంలో 664 మంది

పద్మనాభం రూరల్ : మండలంలోని 22 పంచాయతీల్లో 664 మంది ఆటో డ్రైవర్లను పథకానికి అర్హులుగా గుర్తించినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న మాడవీధులు

సింహాచలం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు భవానీ మాలలు వేసిన వారు ఎక్కువగా రావడంతో రద్దీ నెలకొంది. శుక్రవారం రాత్రి నుంచే భక్తుల సందడి నెలకొంది. వేకువ జామున స్వామివారి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి తొలుత భైరవ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని అప్పన్న ను దర్శించుకున్నారు. మాడవీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కాగా శ్రీఘ్ర దర్శనం రూ. 100 టికెట్లు 7 వేలు, అతి శ్రీఘ్రదర్శనం టికెట్లు 9 వేలు విక్రయించారు. వీటి ద్వారా స్వామివారి ఖజానాకు సుమారు రూ. 30 లక్షల ఆదాయం సమకూరింది. అలాగే లడ్డూ ప్రసాదాలు, పులిహోర విక్రయాలు ద్వారా రూ. 13 లక్షలు వచ్చింది. మొత్తమ్మీద శనివారం ఒక్క రోజే రూ. 49 లక్షలు ఆదాయం లభించింది.

యువకుడి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్‌లో మహిళ ఫొటో తీశాడన్న అభి యోగంపై పీఎంపాలెం పోలీసులు యువకు డ్ని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివ రాలు ప్రకారం.. పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వెనుక వైపు ఉన్న ఒకరి ఇంట్లో 36 ఏళ్ల మహిళ పనిచేస్తోంది. గతనెల 23న ఆమె తాను పనిచేస్తున్న ఇంటికి నడిచి వెళుతుం డగా ఎదురుగా ఉన్న ఏసీ సర్వీసింగ్ సెంట ర్‌లో ఎం. దామోదర్ (21) తన స్నేహితుల తో వీడియోకాల్ మాట్లాడుతున్నాడు. అయితే ఆ యువకుడు సెల్‌ఫోన్‌లో తన ఫొటో తీశా డని సదరు మహిళ తాను పనిచేస్తున్న ఇంటి యజమానికి ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన యువకుడి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని చితక్కొట్టారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యా దు చేయగా, పోలీసులు యువకుడి ప్రవర్తన కారణంగా మహిళకు ఇబ్బంది ఎదురైందన్న అభియోగంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

7న టీడీపీ భీమిలి మండల కమిటీ ప్రమాణ స్వీకారం

భీమునిపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఈనెల 7న జరగనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు నరగడ అప్పారావు తెలిపారు. శని వారం బీచ్‌రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు చిప్పాడ గ్రామంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రమాణ స్వీకారం చేస్తా రని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు, నాయకులు అనిల్‌ప్రసాద్, గరికిన పరశురామ్, గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతినాయుడు, పొట్నూరు రాము, మైలపల్లి లక్ష్మణ రావు, తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం నిల్వకు హీటర్లు



లడ్డూ తయారీ విభాగంలో ఉన్న హీటర్లు

సింహాచలం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి లడ్డూ ప్రసాదం నిల్వకు నూత నంగా హీటింగ్ మెషీన్లు ఏర్పాటు చేశారు. గదిలో లడ్డూ ప్రసాదాలను ఆరబెట్టి మెషీన్ల ద్వారా తడి లేకుండా చేస్తారు. తడిని తొలగించడం వల్ల లడ్డూలు వర్షాకాలంలో కూడా కనీసం వారం రోజుల పాటు నిల్వ ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. గత వర్షాకాలంలో లడ్డూలు పాడ వ్వడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల దేవస్థానానికి కొంతమేరకు ఆర్థికంగా నష్టం కలిగింది. ఈనేపథ్యంలో అధికారులు హీటింగ్ మెషీన్లు ఏర్పాటు చేశారు.

34 మందికి కళ్లద్దాలు పంపిణీ

భీమునిపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో 34 మంది కంటి రోగులకు భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కళ్ల ద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు మాట్లాడుతూ గత నెలలో ది సన్ స్కూల్ ఆవరణలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో తమ అసోసియేషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించిందన్నారు. శిబిరంలో గుర్తించిన రోగులకు శస్త్ర చికిత్స చేయించి, కళ్లద్దాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు కైతపల్లి శ్రీనివాసరావు, సభ్యులు బసవ కృష్ణమూర్తి, వెంపాడ శ్రీనివా సరెడ్డి, ముసునూరి శ్రీనివాసరావు, కాళ్ల సన్నీ, వాండ్రాసి సతీశ్, కాకర్ల సురేశ్, ముమ్మిడిశెట్టి ఆదిత్య, శివ దలాయి, అరుణ్ పాల్గొన్నారు.

వరి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

పద్మనాభం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటలో సస్య రక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టాలని భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి. విజయప్రసాద్, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సరిత చెప్పారు. శనివారం వారు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మం డలాల్లోని పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. సుడిదోమ ఎక్కువగా ఆశిస్తుం దని, రైతులు సింథటిక్ పైరిథాయిడ్స్ అధికం గా వాడడం వల్ల సుడి దోమ ఆశిస్తుందని తెలిపారు. దీని వల్ల చేను వేర్ల భాగంలో సు డులు, సుడులుగా దోమలు చేరి ఆకులోని ర సాన్ని పీలుస్తాయన్నారు. చేను మధ్యలో ఎం డిపోయినట్టు కనిపిస్తుందని చెప్పారు. దీని నివారణకు తూర్పు పడమరలుగా బాటలుగా వేయాలన్నారు. అలాగే నీరు అధికంగా ఉంటే బయకు విడిచిపెట్టి, ఆరబెట్టిన తరువాత మళ్లీ కొత్తనీరు పెట్టాలని చెప్పారు. దోమ ఉ ధృతి తక్కువగా ఉన్నప్పుడు ఇథోఫెన్‌ప్రాక్స్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి ఎకరాకి 400 ఎంఎల్ చొప్పున లేదా ఎఫిసెట్ ఎకరానికి 300 గ్రాములు లేదా క్లోప్రిడ్, ఎసిటమాప్రిడ్ 80 గ్రాములు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

'కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు'

కొమ్మాది, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) :పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని అధిష్ఠానం గుర్తిస్తుందని వైసీపీ భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త చిన్న శ్రీను అన్నారు. మాజీ కార్పొరేటర్, 5వ వార్డు వైసీపీ అధ్యక్షుడు పోతిన హనుమంతురావును పార్టీ అధిష్ఠానం స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్‌గా నియమించింది. ఈమేరకు మధురవాడ ప్రాంత నాయకులు శనివారం విజయనగరంలో చిన్న శ్రీనును కలిశారు. ఈ కార్యక్ర మంలో ఏడో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 8వ వార్డు అధ్యక్షుడు గుడ్లపోలిరెడ్డి, పోతిన మూర్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తొలి 20 ప్లాట్లకే అప్‌సెట్ ధర రూ.23,500

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాపులుప్పాడలో వీఎంఆర్‌డీఏ కొత్తగా వేసిన లేఅవుట్‌లో ప్లాట్లను వేలం ద్వారానే కేటాయిస్తామని కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. తొలి 20 ప్లాట్లకు అప్‌సెట్ ధర గజం రూ.23,500 నుంచి వేలం ప్రారంభి స్తామని, వేలం లేకుండా ఎవరికీ ప్లాట్లు కేటాయించే అవకాశం లేదన్నారు. ఆ తరువాత నిర్వహించే వేలంలో ఈ అప్‌సెట్ ధర పెరిగే అవకాశం ఉందన్నారు.

వైద్య రంగంలో గణనీయమైన మార్పులు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి

ఎండాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజి స్ట్రార్ డాక్టర్ వి. రాధికారెడ్డి అన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాలలో నూ తన విద్యార్థుల కు శనివారం వైట్ కోట్ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు గ్రంథాలతో పాటు రోగిని, రోగి లక్షణాల ను చదవడం నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ నైపుణ్యాలను కలిగి ఉండా లని సూచించారు. నిరంతర సాధన, మానవత విలువలు, సమాజం పట్ల బాధ్యత ఉంటే వైద్యవృత్తిలో అగ్రస్థానానికి చేరవచ్చునని చెప్పారు. ప్రముఖ అంకాలజీ నిపుణుడు డాక్టర్ డి. రఘునాథరావు మాట్లాడుతూ వైద్య రంగంలో కృత్రిమ మేధ పరిజ్ఞానం రానున్న రోజుల్లో కీలక భూమి క పోషిస్తుందన్నారు. ఒత్తిడికి లోనవ్వకుండా వైద్య విద్యార్థులు వృత్తిలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. గీతం వర్సిటీ ప్రో వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించే వారు నిరంతర విద్యార్థిగా ఉండాలని, విలువలకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. జిమ్‌సర్ ప్రో వీసీ డాక్టర్ బి. గీతాంజలి మాట్లాడుతూ విద్యా ర్థులు తెల్ల కోటు ప్రాధాన్యత అర్థం చేసుకుని విలువలతో వృత్తిలో ఎద గాలన్నారు. అనంతరం నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా తెల్ల కోటు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్వీ రావు, గీతం ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ వీవీఎల్ నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళుతున్న ప్రతిమ

ఘనంగా దుర్గాదేవి ప్రతిమల నిమజ్జనం

భీమునిపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోస్తనీ సాగర సంగమంలో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం శనివారం రాత్రి ఘనంగా జరి గింది. ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం,పాతబస్టాండ్‌లోని నూకాంబికా ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో, నేరేళ్లవలస కాలనీ, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిర్వాహకులు కోలాటాలు, సన్నాయిమేళాలు, జాన పద నృత్యాలతో ఊరేగింపుగా తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. విజయ నగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా విగ్రహాలను తీసుకువచ్చారు. భీమిలి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా పోలీసు ఔట్ పోస్టులో మైకు ప్రచారం ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.అలాగే, జనరేటర్ లేకపోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయి బీచ్‌లో అంధకారం నెలకొంది.

పద్మనాభం రూరల్ : అనంతవరం గ్రామంలో దుర్గాదేవి ప్రతిమ నిమజ్జ నం శనివారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతి కార్యక్రమాల మధ్య అమ్మవారి ప్రతిమను వాహనంపై ఊరేగించి,సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెపాటి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు సిద్దనాతి రమణమ్మ, వెంకటరావు,పెద ఎర్నినాయుడు, నాయకులు అప్పల సూర్యనారాయణ, అప్పారావు, గోవిందు, మురారి పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు ఆయిల్ మిల్ సమీపంలో గణేశ్ యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మ వారి నిమజ్జనంతో ముగిసాయి.శనివారం ఉదయం ప్రభాతారాధనలు తరువాత మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

హాస్టల్ విద్యార్థినులకు పచ్చకామెర్లు

కేజీహెచ్‌కు 22 మంది తరలింపు, ప్రత్యేక వార్డులో చికిత్స

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం మన్యం జిల్లా కురు పాం మండలం శివన్నపేట ఏపీఎస్‌టీడబ్ల్యూ హాస్టల్‌కు చెందిన 22 మంది విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడడంతో కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. తొలుత ఈనెల మూడో తేదీన ముగ్గురు విద్యార్థినులు రాగా, శనివారం మరో 19 మంది వచ్చారు. ఇంకో ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువస్తున్నట్టు సమాచా రం. హాస్టల్ విద్యార్థినులు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షలు చేయించగా 24 మందికి పచ్చకామెర్లుగా తేలింది. దీంతో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం 22 మందిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. ప్రత్యేక వార్డులో గ్యాస్ట్రో పిడియాట్రిక్ జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్ష ణలో చికిత్స అందిస్తున్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికా రులు చెబుతున్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో...కూటమి ప్రభుత్వం

... 5వ పేజీ తరువాయి

మధ్యకాలంలో తమ ప్రభుత్వం ఆటోలకు లైఫ్ ట్యాక్స్‌ను మినహాయిస్తే, ఇప్పుడు అధికారంలోకి రాగానే గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేసిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏమైనా సమస్యలు ఉన్నట్టయితే తమకు తెలిపితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ పథకంలో అర్హులైన వారికి డబ్బులు అందక పోతే వార్డు, గ్రామ సచివాలయాన్ని సంప్రతిస్తే ప్రభుత్వం పరిశీలించి తగినచ ర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ లు కడుతూనే సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాల అమలుకు వెనక డుగు వేయకుండా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలగ పూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చే సిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోం దన్నారు. నగర అభివృద్ధికి కొత్త పెట్టుబడులను తీసుకొస్తోందన్నారు. రాబోయే రోజుల్లో టీసీఎస్ వంటి కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించబోతున్నాయ న్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు శ్రీధర్, రాంబాబు మాట్లాడుతూ ఈ మొత్తం తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయంటూ ఉద్విగ్నతకు గురయ్యా రు. ప్రభుత్వం తమ పట్ల చూపిన ఆప్యాయతను మరిచిపోలేమన్నారు. కార్య క్రమంలో ఆటోడ్రైవర్లకు చెక్కును మంత్రి, ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేసారు. అంతకుముందు సర్క్యూట్‌హౌస్ నుంచి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే వెలగపూడి, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆటోలో ప్రయాణించి సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌కు చేరుకున్నారు.

జీవీఎంసీలో వెండింగ్ జోన్లు

... 5వ పేజీ తరువాయి

మల్కాపురం గాంధీనగర్ మార్కెట్‌లో 100, 104 ఏరియాలో 60, ఊర్వశి జం క్షన్ నుంచి కంచరపాలెం మెట్టు రోడ్డులో 14, జింక్ గేటు జంక్షన్ వద్ద 29, దువ్వాడ ఫ్లైఓవర్ కింద 24, ఎన్ఏడీ జంక్షన్‌లో 10, బాజీ జంక్షన్‌లో 5, గోశాల జంక్షన్‌లో 10, అడవివరం జంక్షన్‌లో 10, వేపగుంట జంక్షన్‌లో 15, పెందుర్తిలో 30 మొత్తం 649 దుకాణాల ఏర్పాటుకు స్థలం (వెండింగ్ జోన్) అందుబాటులో ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. దీనికి జిల్లా కలెక్టర్ ఆమోదం తెలపడంతో ఆయా ప్రాంతాల్లో స్ట్రీట్ వెండింగ్ జోన్ ఏర్పాటును ఖరారు చేస్తూ జీవీఎంసీ అధికారులు గెజిట్ జారీచేశారు.

వీధి వర్తకుల సర్వే పూర్తి

నగరంలో వీధి వర్తకులను గుర్తించేందుకు యూసీడీ ఆధ్వర్యంలో ఇటీవల సర్వే పూర్తయింది.ఎనిమిది జోన్‌లలో 18,041 మంది వ్యాపారులను గుర్తించారు. జోన్-1 పరిధిలో 217 మంది, జోన్-2 పరిధిలో 2,965 మంది, జోన్-3 పరిధిలో 3,615, జోన్-4 పరిధిలో 2,879, జోన్-5 పరిధిలో 3,510, జోన్-6 పరిధిలో 2,152 మంది, జోన్-7 పరిధిలో 154 మంది, జోన్-8 పరిధిలో 2,549 మంది వీధి వర్త కులు ఉన్నారు. జీవీఎంసీ నోటిఫైడ్ వీధి వర్తకుడిగా గుర్తింపు పొందాలంటే యూసీడీ విభాగానికి రూ.200 చెల్లించి గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది. అయితే అలాంటివారు జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 6,755 మంది మాత్రమే ఉన్నారు. గుర్తింపు కార్డు పొందినవారు తాము సొంతంగా దుకాణం పెట్టుకుని వ్యాపారం చేసుకోవాల్సి ఉన్నప్పటికీ తమకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుర్తింపుకార్డులు ఉన్నవారితోపా టు ఇటీవల దుకాణాలను కోల్పోయిన వారిని యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మరోసారి సర్వే చేస్తున్నారు. ఎవరైతే వాస్తవంగా ఆ దుకాణంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారో వారికి సమీపంలోని స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో దుకాణం ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు సహాయాన్ని కూడా జీవీఎంసీ ద్వారా అందజేయాలని అధికారులు నిర్ణయించారు. త్వరగా స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు ప్రారంభించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఇంకా పాత ధరలే!

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో పరిశీలించగా, హోల్‌సేల్ అండ్ రిటైల్‌గా మందులు విక్రయించే గుప్తా మెడికల్స్‌లో దీనిపై ప్రత్యేకంగా బోర్డు పెట్టారు. దానికి సమీపంలోనే ఉన్న మెడిప్లస్ మందుల దుకాణంలో మాత్రం జీఎస్‌టీకి సంబంధించిన బోర్డు లేదు. వారి దగ్గర జనరిక్ మందులు కొంటే 50 శాతం నుంచి 80 శాతం తక్కు వకు వస్తాయని, సిబ్బంది కావాలనే బోర్డులు మాత్రం ప్రదర్శించారు. ఇలా బోర్డులు ప్రదర్శించని దుకాణాలు చాలా ఉన్నాయి. అదేవిధంగా రెగ్యులర్‌గా ఇళ్లల్లో వాడే సబ్బులు, టూత్‌పేస్టులు, పౌడర్లు, నూనెలు, వాషింగ్ లిక్విడ్, పప్పు దినుసులపై ఏ మేరకు రేట్లు తగ్గాయనేది ఆయా షాపుల్లో బోర్డులు పెట్టించాలి. ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం నిర్వహించడం అంటే అది. కొం దరు అధికారులు 'క్యూఆర్ కోడ్' ఇచ్చి దానిని స్కాన్ చేస్తే జీఎస్‌టీ ఎంత తగ్గు తుందో తెలుస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఆ కోడ్ స్కాన్ చేస్తే జీఎస్‌టీ క్యాల క్యులేటర్ వస్తోంది. దాంతో ఏమి చేయాలో ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రతిచోట బోర్డులు పెట్టినప్పుడే తేడా తెలుస్తుంది.

రూ.40 లక్షలతో సర్కిల్ అభివృద్ధికి సన్నాహాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని మొట్టమొదటి సర్కిల్‌ను అభివృద్ధి చేయడానికి జీవీఎంసీ రూ. 40 లక్షలు మంజూరు చేసింది. దశాబ్దాల క్రితం నాటి ఈ సర్కిల్ నిర్లక్ష్యానికి గురైందన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. దీనిపై కొద్ది రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికార గణం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో జీవీఎంసీ నిధులు కూడా మంజూరు చేసింది.

ఎంవీపీ సర్కిల్ అంటే డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో ఉన్నదే. మిగిలినవన్నీ తర్వాత అభివృద్ధి చేసిన సర్కిళ్లు. దశాబ్దాల క్రితం నుంచి ఉన్న ఈ సర్కిల్ అభివృద్ధి పట్ల అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఇన్నాళ్లూ అస్సలు పట్టించుకోలేదు. ఇటీవల నగరంలోని అనేక కూడళ్లు స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరిస్తున్నారు. ఒక్కో సర్కిల్ అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. వాటర్ ఫౌంటెన్లు, విద్యుత్తు దీపాలతో అలంకరిస్తున్నారు. ఇదే కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను అభివృద్ధి చేసి, మధ్యలో గోవింద నామాలను ఏర్పాటు చేసి, ఆకర్షణీయంగా తయారు చేశారు. అలాగే ఏఎస్ రాజా కూడలి వద్ద సర్కిల్‌లో అళ్వార్‌దాస్ విగ్రహాన్ని పెట్టి, వాటర్ ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ కార్యాలయం కూడలి సర్కిల్ తర్వాత వచ్చిన వాటినే ఇప్పుడు తాజాగా అభివృద్ధి చేశారు. కానీ పాత సర్కిల్ విషయంలో ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శల నేపథ్యంలో తాజా సన్నాహాల పట్ల ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధి పనులు చేపట్టనున్న ఎంవీపీ కాలనీ మొదటి సర్కిల్


ప్రస్తుతం సర్కిల్ లోపల పరిస్థితి

విగ్రహం ఏర్పాటుపై పితలాటకం?

ఈ సర్కిల్‌ను అభివృద్ధి చేయడానికి గతంలో అధికారులుప్రయత్నించినప్పటికీ కొందరు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడంతో ఆగిపోయింది. ఈ సర్కిల్ వద్ద ఎప్పటికప్పుడు తెలుగుదేశం పార్టీకి చెందిన భారీ ఫ్లెక్సీలు వెలుస్తుంటాయి. ఒక విధంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఇక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా, అభ్యంతర పెట్టడానికి స్థానికులు వెనుకాడుతుంటారు. ఈ సర్కిల్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహం పెట్టాలనే ఆలోచన తెలుగుదేశం శ్రేణుల్లో ఉంది. ఈ ప్రాంతంలో కొద్ది దూరంలో వాసవానిపాలెం ఉంది. ఇక్కడ మత్స్యకారుల జనాభా ఎక్కువ. అలాగే మరో పక్క యాదవుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఒక వర్గం ఈ సర్కిల్‌లో తమ ఆరాధ్యదైవం విగ్రహాన్ని పెట్టాలని ఓ వర్గం యోచనగా తెలుస్తోంది. ఈ విషయంలో వర్గ విభేదాలు తలెత్తే పరిస్థితి ఎదురవడం, ఓ వర్గం ఎన్టీఆర్ విగ్రహం పెట్టాలని భావించడం వంటి అంశంలో తామెందుకు మధ్యలో బాధితులం కావాలనే ఆలోచనతో అధికారులు ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. తాజా టెండరులో విగ్రహం సంగతి పక్కన పెట్టి, మిగిలిన ప్రాంతమంతా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ ఫౌంటెన్, గార్డెనింగ్, అలంకార విద్యుత్తు దీపాలతో పాటు సర్కిల్ చుట్టూ రాక్ టైల్స్‌తో రోడ్డును నిర్మించనున్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కేక్ తినిపిస్తున్న ఆటోడ్రైవర్లు

మద్దిలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. స్థానిక 22వ వార్డు పిఠాపురం కాలనీలో శనివారం ఆయన 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకాన్ని ప్రారంభించారు. ఆటో డ్రైవర్లతో కలిసి ఖాకీ యూనిఫాం ధరించి కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం వెలగపూడి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు వేధింపులు ఉండవన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయడం వల్ల ఆటోలకు కలిగే నష్టం నుంచి భర్తీ చేయడానికి 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకం అమలు చేశామన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి ఏడాది ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తుందన్నారు. అలాగే ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు, ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. సైకో ప్రభుత్వం కాకుండా అభివృద్ధి ధ్యాస గల ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు మంచి జరుగుతుందన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దోపిడీ పార్టీలకు మరోసారి పట్టం కట్టకుండా అభివృద్ధి చేసే కూటమి పార్టీలకే గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, వార్డు కమిటీ నాయకులు కోడిబోయిన ఆనంద్, మల్ల రవి, ఒమ్మిఅప్పారావు, దువ్వి స్వామి, డొక్కర శ్రీను ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని బెదిరించి ఫోన్ లాక్కొని పరారైన ఇద్దరు నిందితులను ఎంవీపీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబధించి ద్వారకా సర్కిల్ నేర విభాగం సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఈ నెల రెండో తేదీ తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో తగరపువలస ప్రాంతానికి చెందిన ఉప్పులూరి కామేశ్వర్ శాస్త్రి (25) నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా, ఇద్దరు వ్యక్తులు అతడి వద్దకు వచ్చి, విజయనగం వెళ్తున్నామని, తమ బైకుపై తగరపువలసలో దించుతామని పేర్కొనగా, వారితో పాటు శాస్త్రీ బండిపైకి ఎక్కారు. మద్దిలపాలెం బస్ డిపో వద్దకు వచ్చిన తర్వాత, శాస్త్రిని సదరు నిందితులు రూ. వంద రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేశారు. నిరాకరించడంతో, అతడిపై దాడి చేసి, అతడి ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితుడు కామేశ్వర్ శాస్త్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారి దర్యాప్తులో కంచరపాలెం ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు వెంటూరి యోగి అలియాస్ యోగేంద్ర (23), తిక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన కట్ట జగన్, అలియాస్ కాగితాలోడు (19) ఈ నేరానికి పాల్పడినట్టు తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఫోన్, ఎలక్ట్రిక్ బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అన్న సమారాధన

వెంకోజీపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హెచ్‌బీ కాలనీ సంజయ్ గాంధీ కాలనీలోని కనకదుర్గ ఆలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, అసోసియేషన్ సభ్యులు నారాయణరావు, మురళీ, సూర్యనారాయణ, రమేష్, మళ్ల దుర్గా తదితరులు పాల్గొన్నారు.

3 ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సింగ్ హోమ్, స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మూడు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను సదరు యాజమాన్యాల దరఖాస్తు మేరకు రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో రిజిస్ట్రేషన్ల రద్దుకు దరఖాస్తు చేశారని, వాటిని పరిశీలించి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అనుమతితో రద్దు చేశామన్నారు.

రిజిస్ట్రేషన్లను రద్దు చేసిన వాటిలో గాజువాకలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్, శ్రీవిద్య స్కానింగ్ సెంటర్, తగరపువలసలోని తల్లీ పిల్లల హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

తనికెళ్ల భరణికి సాహిత్య విజయ విపంచి బిరుదు



సాహిత్య విజయ విపంచి బిరుదుతో తనికెళ్ల భరణికి సత్కరిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో విజయదశమి రోజున రామవరపు విజయలక్ష్మీ మ్యూజిక్ మెమోరియల్ చారిట్రబుల్ ట్రస్టు దశమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ రచయిత, దర్శకుడు, నటుడు తనికెళ్ల భరణికి సాహిత్య విజయ విపంచి బిరుదుతో ఘనంగా సత్కరించారు. వీణ నాద వినోదిని ఇ.గాయత్రికి రామవరపు విజయలక్ష్మీ గ్లోబల్ మ్యూజిక్ మెమోరియల్ అవార్డు, పి.శాంతకు సీనియర్ స్టూడెంట్ ఎక్సెలెన్స్ అవార్డు, ఎ.హిరణ్యకు బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు అందించారు.

ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ కళలు, కళకారులకు ప్రోత్సహించడం ద్వారా భావి తరాలకు సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని అందించిన వారమవుతామన్నారు. సాహిత్య విజయ విపంచి బిరుదుతో తనను సత్కరించిన ట్రస్టు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నిక మోహిని ప్రదర్శించిన భారత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. డాక్టర్ రామవరపు మాధురీదేవి శిష్య బృందం నిర్వహించిన గురుదేవి విజయం కచేరి అలరించింది. కార్యక్రమంలో కార్టూనిస్ట్ సరసీ, ట్రస్టు నిర్వాహకులు నండూరి ఆశావల్లి, రామవరపు మాధురీదేవి, రవీంద్ర తేజశ్వీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

» ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు. చిత్రంలో ఐసీసీఆర్ డైరెక్టర్ పరదీప్‌కుమార్, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్‌కుమార్ పేర్కొన్నారు. వివిధ దేశాల నుంచి ఐసీసీఆర్ ద్వారా ఏయూలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఇంజనీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అనేక దేశాలతో స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందించే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాలను విదేశీ విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఏయూ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల (ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మానవ, మేధో, సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంతర్జాతీయ వ్యవహారాల అసోసియేట్ డీన్, ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఎన్ఎం యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులంతా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ తరఫున కొత్తగా ప్రవేశం పొందిన అంతర్జాతీయ విద్యార్థులు 300 మంది పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక


ఎంపికైన ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టుతో ఏయూ అచార్యులు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక జరిగింది. కర్నాటక రాష్ట్రం బెల్గాం రాణి చిన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 3 నుంచి 7వరకు జరగనున్న సౌత్ ఇండియా యూనివర్సిటీ పురుషుల కబడ్డీ పోటీల్లో ఏయూ జట్టు పాల్గొననుంది. ఇందుకోసం శనివారం జట్టును ఎంపిక చేశారు. ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డెరెక్టర్ ఎన్.విజయమోహన్, ఏయూ ఫ్యాకల్టీ డీన్ రాజేంద్రప్రసాద్, జట్టు కోచ్ ఎస్.రాజేష్, ఐబీపీ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సమతా పీడీ రామకృష్ణ క్రీడాకారులను అభినందించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వైవాహిక జీవితంలో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ సమాచారం ఇచ్చి అదృశ్యం అయ్యాడు. అదృశ్యం కేసు నమోదు చేసిన ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం జిల్లా రాజాం లచ్చయ్యపేటకు చెందిన కాలేపు హేమానికి, జినగాం మణికంఠ (30)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహమైంది. ఈ దంపతులు మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య మనస్పర్థలున్నాయి. ఇతర మహిళలతో తన భర్తకు సంబంధాలు ఉన్నాయని, అలాగే ఆర్థిక సమస్యలు ఉన్నాయని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సెప్టెంబరు 30 సాయంత్రం ఆరున్నర సమయంలో తన ఇంటి నుంచి మణికంఠ ద్విచక్రవాహనంపై బయలుదేరి బయటకు వెళ్లాడు. రాత్రి తొమ్మిదిన్నర సమయంలో ఫోన్‌లో ఇద్దరి మధ్య సంభాషణలో, వారి ఇంటిలోని సొమ్ము భర్త తీసుకువెళ్లడంపై వాగ్వాదం జరిగింది. ఫోన్ పెట్టిన అనంతరం భర్త, తాను ఆత్మహత్య చేసుకుంటానని మెసెజ్ పెట్టి, ఫోన్ స్విచాఫ్ చేశాడు. పలు ప్రాంతాలలో భర్త ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ



» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనేక ఆటంకాలు కల్పించడం, దుష్ప్రచారం చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ విమర్శించారు. ఆయన శనివారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ తీరును దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి వచ్చే పరిశ్రమలు, సంస్థలను రానీయకుండా చేయడమే లక్ష్యమన్నట్టుగా వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఐదేళ్ల వారి పాలనను ప్రజలు అసహ్యించుకొని కేవలం 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. ఆ గెలిచిన ఎమ్మెల్యేలు కూడా శాసనసభకు రాకుండా బయట అవాకులు, చవాకులు మాట్లాడడానికి ఆ పార్టీ నేతలు పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. స్పీకర్ సభకు రావాలని కోరుతున్నా వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వైసీపీ నాయకులు తీరు మార్చుకోవాలని ప్రణవ్ గోపాల్ హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు మంచి చేయాలనే ఉన్నతాశయంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):యువతితో ఉన్నప్పుడు ప్రశ్నించిన వృద్ధుడిపై స్నేహితులతో కలిసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సాధూమఠం సమీపం బాపూజీనగర్‌కి చెందిన వృద్ధుడు బసవబోయిన దేవుడు (60) ఈ నెల 2న మేకలను మేతకు తీసుకువెళ్లినప్పుడు నిర్జీవ ప్రదేశంలో కరకవానిపాలేనికి చెందిన చుక్కా జగదీశ్ (23) ఓ యువతితో కనిపించాడు. జన సంచారం లేని చోట ఎందుకు ఉన్నారని, అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో కోపోద్రోక్తుడైన జగదీశ్ శుక్రవారం తన స్నేహితులైన కొత్తవలసకు చెందిన లెంక సాయికుమార్ (22), పెందుర్తి ద్రోణంరాజునగర్‌కు చెందిన యాండ్రపు మహేశ్(22)లతో కలిసి మేకలమేత కోసం వచ్చిన దేవుడిపై కత్తి, కర్రలతో దాడికి పాల్పడ్డారు.

తనను చంపేస్తారన్న భయంతో దేవుడు పారిపోయి పొదల్లో దాక్కోవడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి జగదీశ్, మహేశ్, సాయికుమార్‌లను అరెస్టు చేశారు.

సినిమా గైడ్

- **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

జిల్లా ఖజానా అధికారి బాధ్యతలు స్వీకారం


బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులు, ఉద్యోగులతో సమావేశమైన జిల్లా ఖజానా అధికారి మోహనరావు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా అధికారిగా కె. మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అకౌంట్స్ అధికారిగా పనిచేసిన మోహనరావుకు డీడీగా పదోన్నతి కల్పించిన ఉన్నతాధికారులు విశాఖ జిల్లా ఖజానా అధికారిగా బదిలీ చేస్తూ నాలుగు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన మోహనరావుకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన వారితో సమావేశమై కార్యాలయ పాలనా వ్యవహారాలపై అడిగి తెలుసుకున్నారు.

డిసెంబరు 19 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



సమావేశంలో మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్. చిత్రంలో చైర్మన్ ధర్మేందర్, తదితరులు

విశాఖపట్నం,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారీ విశాఖపట్నంలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను డిసెంబరు 19, 20, 21 తేదీల్లో గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ ఇ.అశోక్ కుమార్ తెలిపారు. స్థానిక హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పది ప్రాపర్టీ షోలు నిర్వహించామని, ఇది 11వదని పేర్కొన్నారు. అగనంపూడి నుంచి తగరపువలస వరకు విశాఖ నగరం విస్తరించి ఉందని, ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు అన్నీ తిరిగి చూడడం కష్టం కాబట్టి ఒకే వేదికపైకి వాటిని తీసుకువచ్చి కొనుగోలుదారులకు వివరాలను అందుబాటులో ఉంచడమే ఈ షో ప్రధాన ఉద్దేశమన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు వస్తున్నాయని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావస్తున్నదని, పెట్టుబడులకు విశాఖ మంచి ప్రాంతమని చైర్మన్ ధర్మేందర్ పేర్కొన్నారు. పర్యావరణ హితంగా ఎలాంటి ప్రాజెక్టులు వస్తున్నాయో ఈ షో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. గౌరవ కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఫ్లాట్ల కొనుగోలుదారులకు 5 శాతం వరకు ధరలు తగ్గే అవకాశం ఉందని, సిమెంట్ కంపెనీలు 10 శాతం జీఎస్టీని పూర్తిగా తగ్గిస్తే ధరలు కొంతమేరకు అందుబాటులో ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. ఎక్స్‌పో కన్వీనర్ గోవిందరాజు మాట్లాడుతూ మొత్తం 72 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనికి ప్రవేశ రుసుము లేదని, ప్రతి గంటకు లక్కీడ్రా తీసి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.



31 వరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 31 వరకు విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18526/18525), విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22820/22819), విశాఖ-కొరాపుట్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18512/18511), విశాఖ-రాయపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58528/58527), విశాఖ-కొరాపుట్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58538/58537), విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58532/58531), విశాఖ-భవానీపట్నా-విశాఖ పాసింజర్ రైళ్లకు (58504/58503) రెండేసి జనరల్ సీటింగ్ కోచ్‌లు, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఒక స్లీపర్ క్లాసు, ఒక జనరల్ సీటింగ్ కోచ్‌లు జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈశ్వరరావు కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ

కంచరపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ రోజు విద్యుత్ తీగ తెగిపడి మృతిచెందిన గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బత్తిన ఈశ్వరరావు కుటుంబ సభ్యులను 55వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్ శనివారం పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపించిన బాధిత కుటుంబ సభ్యులను వార్డు కమిటీ సభ్యులు ఓదార్చారు. రంజిత్ మాట్లాడుతూ ఎంపీ భరత్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుల దృష్టికి తీసుకెళ్లి ఈశ్వర్రావు కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం చేస్తామన్నారు. టీ దుకాణం నడపడం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో ఇంటి పెద్ద దిక్కు ఈశ్వర్రావు మృతి చెందడంతో ఆధారం లేకుండాపోయింది. ఈ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు పిల్లల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మాజీ కార్పొరేటర్ ఎన్.అప్పారావు, ఎస్.రమణ అప్పారావు, కోటి, వెంకటరావు, యమున, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

'ఎండాడలోనే యాదవ సంఘం భవనం నిర్మించాలి'

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎండాడలో తమకు కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం సహకరించాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అలసి అప్పలనారాయణ డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.యాదవ సంఘానికి మరోచోట స్థలం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసిందని, ఈ ఆలోచన విరమించుకుని భవన నిర్మాణానికి యాదవ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి యాదవుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఐక్యవేదిక నాయకులు కోరండాసు మోహన్ రావు, అల్లురమణ మాట్లాడుతూ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌యాదవ్, అనుపమ యాదవ్, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు పాల్గొన్నారు.

'నిరసనలో పాల్గొనం'

సీతమ్మధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఈ నెల 6 నుంచి దశలవారీగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం సభ్యులు ఎవరూ పాల్గొనబోరని ఈ విభాగం విద్యుత్ కార్మిక సంఘం డిస్కం అధ్యక్షుడు బి.ఎం. నాయుడు స్పష్టంచేశారు. తమ సభ్యులు అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నందున ప్రజల అవసరాలు, విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

డీజే సౌండ్ బాక్స్‌లు సీజ్

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న డీజే సౌండ్‌బాక్స్‌లను టూటౌన్ పోలీసులు సీజ్ చేశారు. రాష్ట్రంలో వీటి వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కన్నయ్యపేటలో ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా వీటిని వినియోగించరాదని, డీజే సౌండ్ శబ్దం కూడా 50 డిజిబులిటీ లోపలే ఉండాలని స్పష్టంచేశారు.

ఇంకా పాత ధరలే!

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో పరిశీలించగా, హోల్‌సేల్ అండ్ రిటైల్‌గా మందులు విక్రయించే గుప్తా మెడికల్స్‌లో దీనిపై ప్రత్యేకంగా బోర్డు పెట్టారు. దానికి సమీపంలోనే ఉన్న మెడిప్లస్ మందుల దుకాణంలో మాత్రం జీఎస్టీకి సంబంధించిన బోర్డు లేదు. వారి దగ్గర జనరిక్ మందులు కొంటే 50 శాతం నుంచి 80 శాతం తక్కువకు వస్తాయని, సిబ్బంది కావాలనే బోర్డులు మాత్రం ప్రదర్శించారు. ఇలా బోర్డులు ప్రదర్శించని దుకాణాలు చాలా ఉన్నాయి. అదేవిధంగా రెగ్యులర్‌గా ఇళ్లల్లో వాడే సబ్బులు, టూత్‌పేస్టులు, పౌడర్లు, నూనెలు, వాషింగ్ లిక్విడ్, పప్పు దినుసులపై ఏ మేరకు రేట్లు తగ్గాయనేది ఆయా షాపుల్లో బోర్డులు పెట్టించాలి. ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం నిర్వహించడం అంటే అది. కొందరు అధికారులు 'క్యూఆర్ కోడ్' ఇచ్చి దానిని స్కాన్ చేస్తే జీఎస్టీ ఎంత తగ్గుతుందో తెలుస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఆ కోడ్ స్కాన్ చేస్తే జీఎస్టీ క్యాలక్యులేటర్ వస్తోంది. దాంతో ఏమి చేయాలో ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రతిచోట బోర్డులు పెట్టినప్పుడే తేడా తెలుస్తుంది.

ఆటో డ్రైవర్లలో వెల్లివిరిసిన సంతోషం


ఆర్టీఓ మంగాదేవితో కలసి సాయాన్ని అందజేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


చెక్కు ప్రదర్శిస్తున్న టీడీపీ నేత గండి.బాబ్జీ, రవాణా శాఖ అధికారులు


ఆటో కార్మికులతో దక్షిణ నియోజకవర్గ టీడీపీ నేత సీతంరాజు సుధాకర్

మాధవధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద సాయం ఎవరికైనా అందకపోతే, వార్డు, గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని రవాణా శాఖ అధికారులు సూచించారు. అర్హులైన ఆటో, మోటార్ కాబ్, మాక్సీ కాబ్ వాహన యజమానులకు రూ.15 వేల చొప్పున సాయం అందించామన్నారు. ఆటో డ్రైవర్ల సేవా పథకం కింద జిల్లాలోని 22,955 మందికి రూ.34,43,25,000 విడుదల చేసినట్లు రవాణా శాఖ కార్యాలయ ఇంఛార్జి డీటీసీ ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు నగదు చెక్కులను శనివారం అధికారికంగా అందజేశారు. విశాఖ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, కొరాడ రాజబాబు, రవాణా శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సాయం జమ చేసినట్లు తెలిపారు.

ఉత్తర నియోజకవర్గంలో..

విశాఖ ఉత్తరం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో ఆర్టీఓ మంగాదేవి, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోన్-5 జెడ్సీ బి.రాము తదితరులు సాయాన్ని అందజేశారు. నియోజకవర్గంలో 2,562 మందికి రూ.3.84 కోట్ల సాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. మాధవస్వామి కల్యాణ మండపంలో ఆటో కార్మికుల సందడి వాతావరణం మధ్య ఈ కార్యక్రమం జరిగింది.

దక్షిణ నియోజకవర్గంలో..

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో 1,927 మంది ఆటో డ్రైవర్లు లబ్ధి పొందారని దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తెలిపారు. శనివారం ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేల వంతున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయటంతో దక్షిణ నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లలో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ ఆటో డ్రైవర్లతో కలసి సంతోషాన్ని పంచుకున్నారు. ఆయన స్వయంగా ఖాకీ చొక్కా వేసుకొని, ఆటో నడిపారు. సూపర్ సిక్స్‌లో లేని పథకాన్ని సైతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని సుధాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లు ప్రయోజనం పొందారని తెలిపారు. ఇది ఆటో డ్రైవర్లకు దసరా కానుక అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీడీసీఏ వార్షిక లీగ్ విజేతలకు ట్రోఫీల బహూకరణ


సిటీ పోలీసుకు ట్రోఫీ అందిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీడీసీఏ ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) నిర్వహించిన వార్షిక లీగ్ టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు శనివారం ట్రోఫీలు బహూకరించారు. శనివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు కె.పార్థసారథి, డి.ఎస్.వర్మ, ఎస్ఎస్ఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: తొలి డివిజన్‌లో ఇస్పాత్ సీసీ, మెట్రో సీసీ; 2వ డివిజన్‌లో వైజాగ్ వెటరన్స్, వైజాగ్ కోల్ట్స్; 3వ డివిజన్‌లో ఉషోదయ సీసీ, 4వ డివిజన్‌లో మెజిస్టిక్ సీసీ, గౌరీ యూత్ సీసీ; 5వ డివిజన్‌లో పెంటమాంబ సీసీ, కోల్ట్స్ సీసీ; 6వ డివిజన్‌లో ఆశరాయ సీసీ, శ్రీగణేష్ సీసీ విన్నర్, రన్నర్‌ప్‌గా నిలవగా ఇనిస్టిట్యూషనల్ కేటగిరిలో సిటీ పోలీసు, ఏపీఈపీడీసీఎల్ జట్లు విన్నర్, రన్నరప్ స్థానాలను సాధించాయి.

తొలి డివిజన్ విభాగంలో ఉత్తమ ఆల్‌రౌండర్‌గా రైల్వేస్ ఆటగాడు ఎంఎస్.దీప్ నిలిచాడు. తొమ్మిది మ్యాచ్‌లలో దీపక్ 430 పరుగులు చేయడంతోపాటు 13 వికెట్లు పడగొట్టాడు. మిగిలిన డివిజన్లలో సయార్ జోగి (సోలోస్), పి.వంశీనారాయణ (వీసీసీ), వి.కె.సిద్దార్థ్ (మెజిస్టిక్), ఎం.అవినాష్ (కోల్ట్స్), జస్బీర్ సింగ్ (ఎన్‌ఏడీ), టి.అభిషేక్ (ఏపీఈపీడీసీఎల్) ఉత్తమ ఆల్‌రౌండర్ అవార్డులు అందుకున్నారు. వీరితోపాటు డివిజన్ల వారీగా ఉత్తమ బ్యాట్స్‌మేన్, ఉత్తమ బౌలర్ అవార్డులనందజేశారు.

సమస్యల పరిష్కారానికి సృజనాత్మక ఆలోచనలు అవసరం

ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుఘీసు

సీతమ్మధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధకులను ప్రేరేపిస్తూ సమాజ సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుఘీసు సూచించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ హ్యాకథాన్ నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ (2025)ను ప్రాజ్ఞా రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. లెర్న్, లాంచ్, లీడ్ అంశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అబ్రహం వరుఘీసు మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ రెండు రోజులు గ్లోబల్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని, 30 కళాశాలల నుంచి 360 మంది విద్యార్థులు 55 బృందాలుగా పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన నాసా స్పేస్ యాప్స్ చాలెంజ్ ప్రతినిధిగా లోకల్ లీడ్‌గా సీహెచ్ వెంకట్‌ను నియమించారని, కళాశాల నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డి.భుజంగరావు పర్యవేక్షణలో విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేస్తారన్నారు. వీటిని నాసా పరిశీలించి న్యాయ నిర్ణేతలతో ప్రథమ స్థానాన్ని నిర్ధరిస్తారని మధుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌బీసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి

సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు


గీతాలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఘన చరిత్ర కలిగిన మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం పురస్కరించుకుని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెలోడీ సాంస్కృతిక వైభవం, నటరత్న యువతర సినీ సంగీత విభావరిని శనివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వంకాయల సన్యాసిరాజు, వీవీ రమణమూర్తి, మట్టపల్లి హనుమంతరావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక వైభవానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆనందకరమని జీఎస్ఎన్ రాజు అన్నారు. సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, కడలి, ఎస్.విజయకుమార్, సీహెచ్ చిట్టిబాబు, కొణతాల రాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, ఉష చీరాలు, కె.అరుణకాంత మాట్లాడారు. యువరత్న, నటరత్న నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు వీరస్వామి, సత్యనారాయణ, ప్రభాకర్, మాధవ్, పుండరీకుమార్, రాము, అభినయ్, ప్రసాద్, జ్యోతి, లక్ష్మీసాత్విక, రంజిత, ప్రణవి, హర్షితలు, ఎన్టీఆర్, బాలకృష్ణ నటించిన సినిమాల్లోని గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి సోమేష్ బృందం సంగీత వాద్య సహకారం అందించగా, లక్ష్మీస్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కబడ్డీ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. కర్ణాటకలోని బెళగావిలో రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరగనున్న ఈ టోర్నీలో ఏయూ జట్టుకు వి.మహేష్, జి.జనార్ధన్, డి.దుర్గాప్రసాద్, బి.రాకేష్, ఎన్.కనకరాజు, ఎల్.కైలాష్, టి.మణికంఠ, బి.హేమంత్‌కుమార్, ఎస్.సాయి, వి.సాయి గణేష్, కె.ప్రభాకరరావు, పి.పృథ్వీరాజు, ఎం.దినేష్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. కోచ్‌గా ఎస్.రాజేష్ వ్యవహరిస్తారని ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు. జట్టు సభ్యులను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు అభినందించి పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఐఏపీ స్పోర్ట్సు ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్‌కు నగర వాసి


మూగు సురేశ్ రెడ్డి

సింధియా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌లో జరగనున్న 2వ ఆసియా అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ భారత టీ 10 టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టుకు 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి మూగు సురేశ్ రెడ్డి (20) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసు నుంచే క్రీడల పట్ల అమితమైన ఆసక్తి, నిత్యం సాధన చేయడం వల్ల ఈ అవకాశం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆంధ్రప్రదేశ్ టీ 10 క్రికెట్ అసోసియేషన్ పీడీ సుకుమార్, రాంబాబు తదితరులు సరేశ్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

మన్యం జిల్లాలో హాస్టల్ విద్యార్థినులకు పచ్చకామెర్లు

▸▸ కేజీహెచ్‌కు 22 మంది తరలింపు ▸▸ ప్రత్యేక వార్డులో చికిత్స

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట ఏపీఎస్‌టీడబ్ల్యూ హాస్టల్‌కు చెందిన 22 మంది విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. తొలుత ఈ నెల మూడో తేదీన ముగ్గురు విద్యార్థినులు రాగా, శనివారం మరో 19 మంది వచ్చారు. ఇంకో ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువస్తున్నట్టు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం శివన్నపేట ఏపీఎస్‌టీడబ్ల్యూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షలు చేయించగా 24 మందికి పచ్చకామెర్లుగా తేలింది. దీంతో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం వారిలోని 22 మందిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. ప్రత్యేక వార్డులో గ్యాస్ట్రో పిడియాట్రిక్ జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రయాణికుల ద్వారా రూ.426 కోట్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

21.69 శాతం అధికం. ● ర్యాక్‌ల టర్న్ అరౌండ్ సామర్థ్యం పెరిగింది. గతంలో రోజుకు 53.8 ర్యాక్‌లకు సరకులు లోడింగ్ కాగా ఇప్పుడు 59.6 ర్యాక్‌లు చేస్తున్నారు. ● గతంలో ఐరన్‌ఓర్ రవాణా ద్వారా రూ.662.92 కోట్ల ఆదాయం రాగా ఈసారి అది రూ.800 కోట్లకు చేరింది. ● సెప్టెంబరు చివరి నాటికి 1.64 కోట్ల ప్రయాణికులు రైళ్ల ద్వారా గమ్యం చేరారు. ● డివిజన్‌లో నార్కోటిక్ డ్రగ్స్ కేసులు 121 నమోదు చేసి రూ.2.86 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ● స్టేషన్ల ఆవరణను దుర్వినియోగం చేసినందుకు 30 వేల మందిపై కేసులు నమోదు చేశారు. ● రైళ్ల పైకి రాళ్లు విసిరే వారికి సంబంధించి గత ఏడాది 28 కేసులు నమోదు కాగా స్థానిక నాయకులతో చర్యలు జరపడం వల్ల ఈ ఘటనల సంఖ్య ఐదుకు చేరింది. ● పిల్లల అక్రమ రవాణాను నిరోధించి 273 మంది బాలలను, 69 మంది బాలికలను సంబంధీకులకు అప్పగించారు...

ఫ్లాట్ల ధరలు దిగొచ్చేనా?

5వ పేజీ తరువాయి

తగ్గాయి. కానీ బిల్డర్లు తగ్గలేదని చెప్పడం గమనార్హం. ఇక స్టీల్ రేట్లు చూసుకుంటే వైజాగ్ స్టీల్ టన్ను రూ.54 వేలకు దొరుకుతోంది. గతంలో ఇదే స్టీల్ టన్ను రూ.90 వేలు పలికింది. అంటే ఎంత తేడా ఉందో అర్థం చేసుకోవచ్చు. సింహాద్రి స్టీల్ టన్ను రూ.53 వేలకు దొరుకుతోంది. ఈ ప్రయోజనం కొనుగోలుదారులకు అందడం లేదు.

ఏదేమైనా స్టీల్, సిమెంట్ ధరలు బాగా తగ్గినందున బిల్డర్లు ఆ మేరకు ఫ్లాట్ల ధరలను తగ్గించాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రేట్లు ఎక్కువైనపుడు ఎలా పెంచుతున్నారో తగ్గినప్పుడు కూడా ఆ ప్రయోజనం కొనుగోలుదారులకు అందిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ రంగంలోనే వైద్యవిద్య కొనసాగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల సూచన


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య చలం

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైద్య కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక, పీపుల్ ఫర్ ఇండియా, విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ వైద్య విద్యా కళాశాలలు, ప్రజారోగ్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ చలం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య విద్యను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన ధనాన్ని ప్రైవేట్ వారికి అతిచౌకగా కట్టబెట్టే పీపీపీ విధానం వైద్య రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడంలో భాగమని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ సంపద సృష్టిస్తాననే నినాదంతో ముందుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ, ప్రజల సంపదను ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. దీని వలన డబ్బున్నవాళ్లే చదువుకునే పరిస్థితి ఉంటుందన్నారు. ఆర్థికభారంతో పాటు ప్రతిభ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రజా ఆరోగ్యవేదిక అధ్యక్షుడు టి.కామేశ్వరరావు, ఐసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరి, వరప్రసాద్ మాట్లాడుతూ పీపీపీ విధానాన్ని విరమించి 10 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో డీవైఎఫ్ఐ రాజు, ఎస్ఎఫ్ఐ నాయుడు, అజయ్, ఐద్వా మాధవి, సాగర్, వసంత్, కుమార్, మణి, మేరీ, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

వలందపేటలో బాణసంచా పేలుడు

▸▸ ముగ్గురికి తీవ్ర గాయాలు ▸▸ ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాకి మహేశ్, నగిరెడ్ల వాసు, చిల్ల కనకారెడ్డి


వలందపేటలో సంఘటన జరిగిన ప్రదేశం

తగరపువలస, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తగరపువలస సమీపంలోని వలందపేటలో శుక్రవారం రాత్రి బాణసంచా సామగ్రి పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు శనివారం అమ్మవారి ప్రతిమ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు బాకి మహేశ్, (35), నగిరెడ్ల వాసు (32), చిల్ల కనకారెడ్డి (26)లు శుక్రవారం రాత్రి అమ్మవారి మండపానికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో బాణసంచా తయారీకి సిద్ధమయ్యారు. అనాలోచితంగా ముడి సరకులను కలిపి ఖాళీ బాటిల్‌తో నింపుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలో ఉన్న ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో సీఐ తిరుమలరావు, ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శనివారం క్లూస్ టీమ్ కూడా ఆధారాలు సేకరించింది. కాగా క్షతగాత్రుల్లో మహేశ్ పరిస్థితి విషమంగా ఉంది. మహేశ్, వాసు ప్లంబర్లుగా, కనకారెడ్డి తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. సీఐ తిరుమలరావు మాట్లాడుతూ బాధితుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

తొలి 20 ప్లాట్లకే అప్‌సెట్ ధర రూ.23,500

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాపులుప్పాడలో వీఎంఆర్‌డీఏ కొత్తగా వేసిన లేఅవుట్‌లో ప్లాట్లను వేలం ద్వారానే కేటాయిస్తామని కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. తొలి 20 ప్లాట్లకు అప్‌సెట్ ధర గజం రూ.23,500 నుంచి వేలం ప్రారంభిస్తామని, వేలం లేకుండా ఎవరికీ ప్లాట్లు కేటాయించే అవకాశం లేదన్నారు. ఆ తరువాత నిర్వహించే వేలంలో ఈ అప్‌సెట్ ధర పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో...కూటమి ప్రభుత్వం

... 5వ పేజీ తరువాయి

మధ్యకాలంలో తమ ప్రభుత్వం ఆటోలకు లైఫ్ ట్యాక్స్‌ను మినహాయిస్తే, ఇప్పుడు అధికారంలోకి రాగానే గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేసిందన్నారు. ఆటోడ్రైవర్లకు ఏమైనా సమస్యలు ఉన్నట్టయితే తమకు తెలిపితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ పథకంలో అర్హులైన వారికి డబ్బులు అందకపోతే వార్డు, గ్రామ సచివాలయాన్ని సంప్రతిస్తే ప్రభుత్వం పరిశీలించి తగినచర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాల అమలుకు వెనకడుగు వేయకుండా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నగర అభివృద్ధికి కొత్త పెట్టుబడులను తీసుకొస్తోందన్నారు. రాబోయే రోజుల్లో టీసీఎస్ వంటి కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించబోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు శ్రీధర్, రాంబాబు మాట్లాడుతూ ఈ మొత్తం తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయంటూ ఉద్విగ్నతకు గురయ్యారు. ప్రభుత్వం తమ పట్ల చూపిన ఆప్యాయతను మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లకు చెక్కును మంత్రి, ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేసారు. అంతకుముందు సర్క్యూట్‌హౌస్ నుంచి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే వెలగపూడి, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆటోలో ప్రయాణించి సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌కు చేరుకున్నారు.

జీవీఎంసీలో వెండింగ్ జోన్లు

... 5వ పేజీ తరువాయి

మల్కాపురం గాంధీనగర్ మార్కెట్‌లో 100, 104 ఏరియాలో 60, ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు రోడ్డులో 14, జింక్ గేటు జంక్షన్ వద్ద 29, దువ్వాడ ఫ్లైఓవర్ కింద 24, ఎన్ఏడీ జంక్షన్‌లో 10, బాజి జంక్షన్‌లో 5, గోశాల జంక్షన్‌లో 10, అడవివరం జంక్షన్‌లో 10, వేపగుంట జంక్షన్‌లో 15, పెందుర్తిలో 30 మొత్తం 649 దుకాణాల ఏర్పాటుకు స్థలం (వెండింగ్ జోన్) అందుబాటులో ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. దీనికి జిల్లా కలెక్టర్ ఆమోదం తెలపడంతో ఆయా ప్రాంతాల్లో స్ట్రీట్ వెండింగ్ జోన్ ఏర్పాటును ఖరారు చేస్తూ జీవీఎంసీ అధికారులు గెజిట్ జారీచేశారు.

వీధి వర్తకుల సర్వే పూర్తి

నగరంలో వీధి వర్తకులను గుర్తించేందుకు యూసీడీ ఆధ్వర్యంలో ఇటీవల సర్వే పూర్తయింది. ఎనిమిది జోన్‌ల పరిధిలో 18,041 మంది వ్యాపారులను గుర్తించారు. జోన్-1 పరిధిలో 217 మంది, జోన్-2 పరిధిలో 2,965 మంది, జోన్-3 పరిధిలో 3,615, జోన్-4 పరిధిలో 2,879, జోన్-5 పరిధిలో 3,510, జోన్-6 పరిధిలో 2,152 మంది, జోన్-7 పరిధిలో 154 మంది, జోన్-8 పరిధిలో 2,549 మంది వీధి వర్తకులు ఉన్నారు. జీవీఎంసీ నోటిఫైడ్ వీధి వర్తకుడిగా గుర్తింపు పొందాలంటే యూసీడీ విభాగానికి రూ.200 చెల్లించి గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది. అయితే అలాంటివారు జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 6,755 మంది మాత్రమే ఉన్నారు. గుర్తింపు కార్డు పొందినవారు తాము సొంతంగా దుకాణం పెట్టుకుని వ్యాపారం చేసుకోవాల్సి ఉన్నప్పటికీ తమకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుర్తింపుకార్డులు ఉన్నవారితోపాటు ఇటీవల దుకాణాలను కోల్పోయిన వారిని యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మరోసారి సర్వే చేస్తున్నారు. ఎవరైతే వాస్తవంగా ఆ దుకాణంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారో వారికి సమీపంలోని స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో దుకాణం ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు సహాయాన్ని కూడా జీవీఎంసీ ద్వారా అందజేయాలని అధికారులు నిర్ణయించారు. వీలైనంత త్వరగా స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు ప్రారంభించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

జడ్పీలో రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ఫోన్ చేసి 'జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు రాకపోవడానికి మీ నిర్లక్ష్యమే కారణం' అంటూ వ్యాఖ్యానించడంతో పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలోనే ఉన్న విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రధానంగా కలెక్టర్లకు ప్రభుత్వ కార్యక్రమం తొలి ప్రాధాన్యం, జడ్పీ సమావేశం రెండో ప్రాధాన్యం అంటూ జడ్పీ సమావేశం వాయిదా వేసుకుని ఉండాల్సిందని పేర్కొనడం గమనార్హం. కాగా అల్లూరి జిల్లా అనంతగిరిలో రెండు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వంలోనే వచ్చాయి. వాటిపై అప్పట్లో మౌనంగా ఉన్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటని సమావేశంలో సభ్యుడొకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే వైసీపీ హయాంలో జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక రోడ్లను బాగుచేయించింది. కానీ ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విమర్శలు చేయడంతో రాజకీయ లబ్ధికోసమేననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక, ఒక్క అంశాన్ని పట్టుకుని గంటల తరబడి సాగదీస్తున్నారు. ఇదే విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ శనివారం ప్రస్తావించి అన్ని అంశాలకు సమయం కేటాయించాలన్నారు. సమావేశం మధ్యలో ఆయన వెళ్లిపోయిన తరువాత సమస్యలను పక్కనపెట్టి ప్రొటోకాల్ అంశంపై సభ్యులు చర్చించడం గందరగోళానికి దారితీసింది. ప్రతి అంశానికి నిర్దిష్ట సమయం నిర్ణయించి చర్చించేలా అధ్యక్ష స్థానంలో ఉన్న ఛైర్‌పర్సన్ చూడాలి. గడచిన నాలుగేళ్లలో అసలు చర్చకు రాని శాఖలే ఎక్కువగా ఉన్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆదేశిస్తారు. దీంతో రోజంతా వారు జడ్పీలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. శనివారం సమావేశాలకు హాజరుకాని అధికారులను జడ్పీ అధికారులు ఆగమేఘాలపై పిలిపించారు. వారికి సంబంధించిన శాఖలపై చర్చ చేపట్టారా?...అంటే అదీ లేదు.

రూ.40 లక్షలతో సర్కిల్ అభివృద్ధికి సన్నాహాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని మొట్టమొదటి సర్కిల్‌ను అభివృద్ధి చేయడానికి జీవీఎంసీ రూ. 40 లక్షలు మంజూరు చేసింది. దశాబ్దాల క్రితం నాటి ఈ సర్కిల్ నిర్లక్ష్యానికి గురైందన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. దీనిపై కొద్ది రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికార గణం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో జీవీఎంసీ నిధులు కూడా మంజూరు చేసింది.

ఎంవీపీ సర్కిల్ అంటే డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో ఉన్నదే. మిగిలినవన్నీ తర్వాత అభివృద్ధి చేసిన సర్కిళ్లు. దశాబ్దాల క్రితం నుంచి ఉన్న ఈ సర్కిల్ అభివృద్ధి పట్ల అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఇన్నాళ్లూ అస్సలు పట్టించుకోలేదు. ఇటీవల నగరంలోని అనేక కూడళ్లు స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరిస్తున్నారు. ఒక్కో సర్కిల్ అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. వాటర్ ఫౌంటెన్లు, విద్యుత్తు దీపాలతో అలంకరిస్తున్నారు. ఇదే కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను అభివృద్ధి చేసి, మధ్యలో గోవింద నామాలను ఏర్పాటు చేసి, ఆకర్షణీయంగా తయారు చేశారు. అలాగే ఏఎస్ రాజా కూడలి వద్ద సర్కిల్‌లో అళ్వార్‌దాస్ విగ్రహాన్ని పెట్టి, వాటర్ ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ కార్యాలయం కూడలి సర్కిల్ తర్వాత వచ్చిన వాటినే ఇప్పుడు తాజాగా అభివృద్ధి చేశారు. కానీ పాత సర్కిల్ విషయంలో ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శల నేపథ్యంలో తాజా సన్నాహాల పట్ల ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనులు చేపట్టనున్న ఎంవీపీ కాలనీ మొదటి సర్కిల్



ప్రస్తుతం సర్కిల్ లోపల పరిస్థితి

విగ్రహం ఏర్పాటుపై పితలాటకం?

ఈ సర్కిల్‌ను అభివృద్ధి చేయడానికి గతంలో అధికారులు ప్రయత్నించినప్పటికీ కొందరు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడంతో ఆగిపోయింది. ఈ సర్కిల్ వద్ద ఎప్పటికప్పుడు తెలుగుదేశం పార్టీకి చెందిన భారీ ఫ్లెక్సీలు వెలుస్తుంటాయి. ఒక విధంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఇక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా, అభ్యంతర పెట్టడానికి స్థానికులు వెనుకాడుతుంటారు. ఈ సర్కిల్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహం పెట్టాలనే ఆలోచన తెలుగుదేశం శ్రేణుల్లో ఉంది. ఈ ప్రాంతంలో కొద్ది దూరంలో వాసవానిపాలెం ఉంది. ఇక్కడ మత్స్యకారుల జనాభా ఎక్కువ. అలాగే మరో పక్క యాదవుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఒక వర్గం ఈ సర్కిల్‌లో తమ ఆరాధ్యదైవం విగ్రహాన్ని పెట్టాలని ఓ వర్గం యోచనగా తెలుస్తోంది. ఈ విషయంలో వర్గ విభేదాలు తలెత్తే పరిస్థితి ఎదురవడం, ఓ వర్గం ఎన్టీఆర్ విగ్రహం పెట్టాలని భావించడం వంటి అంశంలో తామెందుకు మధ్యలో బాధితులం కావాలనే ఆలోచనతో అధికారులు ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. తాజా టెండరులో విగ్రహం సంగతి పక్కన పెట్టి, మిగిలిన ప్రాంతమంతా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ ఫౌంటెన్, గార్డెనింగ్, అలంకార విద్యుత్తు దీపాలతో పాటు సర్కిల్ చుట్టూ రాక్ టైల్స్‌తో రోడ్డును నిర్మించనున్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కేక్ తినిపిస్తున్న ఆటోడ్రైవర్లు

మద్దిలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. స్థానిక 22వ వార్డు పిఠాపురం కాలనీలో శనివారం ఆయన 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకాన్ని ప్రారంభించారు. ఆటో డ్రైవర్లతో కలిసి ఖాకీ యూనిఫాం ధరించి కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం వెలగపూడి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు వేధింపులు ఉండవన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయడం వల్ల ఆటోలకు కలిగే నష్టం నుంచి భర్తీ చేయడానికి 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకం అమలు చేశామన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి ఏడాది ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తుందన్నారు. అలాగే ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు, ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. సైకో ప్రభుత్వం కాకుండా అభివృద్ధి ధ్యాస గల ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు మంచి జరుగుతుందన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దోపిడీ పార్టీలకు మరోసారి పట్టం కట్టకుండా అభివృద్ధి చేసే కూటమి పార్టీలకే గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, వార్డు కమిటీ నాయకులు కోడిబోయిన ఆనంద్, మల్ల రవి, ఒమ్మిఅప్పారావు, దువ్వి స్వామి, డొక్కర శ్రీను ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని బెదిరించి ఫోన్ లాక్కొని పరారైన ఇద్దరు నిందితులను ఎంవీపీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబధించి ద్వారకా సర్కిల్ నేర విభాగం సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఈ నెల రెండో తేదీ తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో తగరపువలస ప్రాంతానికి చెందిన ఉప్పులూరి కామేశ్వర్ శాస్త్రి (25) నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా, ఇద్దరు వ్యక్తులు అతడి వద్దకు వచ్చి, విజయనగం వెళ్తున్నామని, తమ బైకుపై తగరపువలసలో దించుతామని పేర్కొనగా, వారితో పాటు శాస్త్రీ బండిపైకి ఎక్కారు. మద్దిలపాలెం బస్ డిపో వద్దకు వచ్చిన తర్వాత, శాస్త్రిని సదరు నిందితులు రూ. వంద రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేశారు. నిరాకరించడంతో, అతడిపై దాడి చేసి, అతడి ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితుడు కామేశ్వర్ శాస్త్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారి దర్యాప్తులో కంచరపాలెం ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు వెంటూరి యోగి అలియాస్ యోగేంద్ర (23), తిక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన కట్ట జగన్, అలియాస్ కాగితాలోడు (19) ఈ నేరానికి పాల్పడినట్టు తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఫోన్, ఎలక్ట్రిక్ బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అన్న సమారాధన

వెంకోజీపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హెచ్‌బీ కాలనీ సంజయ్ గాంధీ కాలనీలోని కనకదుర్గ ఆలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, అసోసియేషన్ సభ్యులు నారాయణరావు, మురళీ, సూర్యనారాయణ, రమేష్, మళ్ల దుర్గా తదితరులు పాల్గొన్నారు.

3 ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సింగ్ హోమ్, స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మూడు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను సదరు యాజమాన్యాల దరఖాస్తు మేరకు రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో రిజిస్ట్రేషన్ల రద్దుకు దరఖాస్తు చేశారని, వాటిని పరిశీలించి కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అనుమతితో రద్దు చేశామన్నారు.

రిజిస్ట్రేషన్లను రద్దు చేసిన వాటిలో గాజువాకలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్, శ్రీవిద్య స్కానింగ్ సెంటర్, తగరపువలసలోని తల్లీ పిల్లల హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

తనికెళ్ల భరణికి సాహిత్య విజయ విపంచి బిరుదు



సాహిత్య విజయ విపంచి బిరుదుతో తనికెళ్ల భరణికి సత్కరిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో విజయదశమి రోజున రామవరపు విజయలక్ష్మీ మ్యూజిక్ మెమోరియల్ చారిట్రబుల్ ట్రస్టు దశమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ రచయిత, దర్శకుడు, నటుడు తనికెళ్ల భరణికి సాహిత్య విజయ విపంచి బిరుదుతో ఘనంగా సత్కరించారు. వీణ నాద వినోదిని ఇ.గాయత్రికి రామవరపు విజయలక్ష్మీ గ్లోబల్ మ్యూజిక్ మెమోరియల్ అవార్డు, పి.శాంతకు సీనియర్ స్టూడెంట్ ఎక్సలెన్స్ అవార్డు, ఎ.హిరణ్యకు బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు అందించారు.

ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ కళలు, కళకారులకు ప్రోత్సహించడం ద్వారా భావి తరాలకు సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని అందించిన వారమవుతామన్నారు. సాహిత్య విజయ విపంచి బిరుదుతో తనను సత్కరించిన ట్రస్టు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నిక మోహిని ప్రదర్శించిన భారత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. డాక్టర్ రామవరపు మాధురీదేవి శిష్య బృందం నిర్వహించిన గురుదేవి విజయం కచేరి అలరించింది. కార్యక్రమంలో కార్టూనిస్ట్ సరసీ, ట్రస్టు నిర్వాహకులు నండూరి ఆశావల్లి, రామవరపు మాధురీదేవి, రవీంద్ర తేజస్వీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

» ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు. చిత్రంలో ఐసీసీఆర్ డైరెక్టర్ పరదీప్‌కుమార్, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్‌కుమార్ పేర్కొన్నారు. వివిధ దేశాల నుంచి ఐసీసీఆర్ ద్వారా ఏయూలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఇంజనీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అనేక దేశాలతో స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందించే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాలను విదేశీ విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఏయూ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల (ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మానవ, మేధో, సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంతర్జాతీయ వ్యవహారాల అసోసియేట్ డీన్, ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఎస్ఎం యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులంతా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ తరపున కొత్తగా ప్రవేశం పొందిన అంతర్జాతీయ విద్యార్థులు 300 మంది పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టుతో ఏయూ ఆచార్యులు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక జరిగింది. కర్నాటక రాష్ట్రం బెల్గాం రాణి చిన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 3 నుంచి 7వరకు జరగనున్న సౌత్ ఇండియా యూనివర్సిటీ పురుషుల కబడ్డీ పోటీల్లో ఏయూ జట్టు పాల్గొననుంది. ఇందు కోసం శనివారం జట్టును ఎంపిక చేశారు. ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎన్.విజయమోహన్, ఏయూ ఫ్యాకల్టీ డీన్ రాజేంద్రప్రసాద్, జట్టు కోచ్ ఎస్.రాజేష్, ఐపీ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సమతా పీడీ రామకృష్ణ క్రీడాకారులను అభినందించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వైవాహిక జీవితంలో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ సమాచారం ఇచ్చి అదృశ్యం అయ్యాడు. అదృశ్యం కేసు నమోదు చేసిన ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం జిల్లా రాజాం లచ్చయ్యపేటకు చెందిన కాలేపు హేమానికి, జినగాం మణికంఠ (30)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహమైంది. ఈ దంపతులు మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య మనస్పర్థలున్నాయి. ఇతర మహిళలతో తన భర్తకు సంబంధాలు ఉన్నాయని, అలాగే ఆర్థిక సమస్యలు ఉన్నాయని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సెప్టెంబరు 30 సాయంత్రం ఆరున్నర సమయంలో తన ఇంటి నుంచి మణికంఠ ద్విచక్రవాహనంపై బయలుదేరి బయటకు వెళ్లాడు. రాత్రి తొమ్మిదిన్నర సమయంలో ఫోన్‌లో ఇద్దరి మధ్య సంభాషణలో, వారి ఇంటిలోని సొమ్ము భర్త తీసుకువెళ్లడంపై వాగ్వాదం జరిగింది. ఫోన్ పెట్టిన అనంతరం భర్త, తాను ఆత్మహత్య చేసుకుంటానని మెసెజ్ పెట్టి, ఫోన్ స్విచాఫ్ చేశాడు. పలు ప్రాంతాలలో భర్త ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ

» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్



సిరిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనేక ఆటంకాలు కల్పించడం, దుష్ప్రచారం చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ విమర్శించారు. ఆయన శనివారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ తీరును దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి వచ్చే పరిశ్రమలు, సంస్థలను రానీయకుండా చేయడమే లక్ష్యమన్నట్టుగా వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఐదేళ్ల వారి పాలనను ప్రజలు అసహ్యించుకొని కేవలం 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. ఆ గెలిచిన ఎమ్మెల్యేలు కూడా శాసనసభకు రాకుండా బయట అవాకులు, చవాకులు మాట్లాడడానికి ఆ పార్టీ నేతలు పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. స్పీకర్ సభకు రావాలని కోరుతున్నా వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వైసీపీ నాయకులు తీరు మార్చుకోవాలని ప్రణవ్ గోపాల్ హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు మంచి చేయాలనే ఉన్నతాశయంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):యువతితో ఉన్నప్పుడు ప్రశ్నించిన వృద్ధుడిపై స్నేహితులతో కలిసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సాధూమఠం సమీపం బాపూజీనగర్‌కి చెందిన వృద్ధుడు బసవబోయిన దేవుడు (60) ఈ నెల 2న మేకలను మేతకు తీసుకువెళ్లినప్పుడు నిర్జీవ ప్రదేశంలో కరకవానిపాలేనికి చెందిన చుక్కా జగదీశ్ (23) ఓ యువతితో కనిపించాడు. జన సంచారం లేని చోట ఎందుకు ఉన్నారని, అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన జగదీశ్ శుక్రవారం తన స్నేహితులైన కొత్తవలసకు చెందిన లెంక సాయికుమార్ (22), పెందుర్తి ద్రోణంరాజునగర్‌కు చెందిన యాండ్రపు మహేశ్(22)లతో కలిసి మేకలమేత కోసం వచ్చిన దేవుడిపై కత్తి, కర్రలతో దాడికి పాల్పడ్డారు.

తనను చంపేస్తారన్న భయంతో దేవుడు పారిపోయి పొదల్లో దాక్కోవడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి జగదీశ్, మహేశ్, సాయికుమార్‌లను అరెస్టు చేశారు.

జిల్లా ఖజానా అధికారి బాధ్యతలు స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులు, ఉద్యోగులతో సమావేశమైన జిల్లా ఖజానా అధికారి మోహనరావు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా అధికారిగా కె.మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అకౌంట్స్ అధికారిగా పనిచేసిన మోహనరావుకు డీడీగా పదోన్నతి కల్పించిన ఉన్నతాధికారులు విశాఖ జిల్లా ఖజానా అధికారిగా బదిలీ చేస్తూ నాలుగు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన మోహనరావుకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన వారితో సమావేశమై కార్యాలయ పాలనా వ్యవహారాలపై అడిగి తెలుసుకున్నారు.

డిసెంబరు 19 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



సమావేశంలో మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్. చిత్రంలో చైర్మన్ ధర్మేందర్, తదితరులు

విశాఖపట్నం,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారీ విశాఖపట్నంలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను డిసెంబరు 19, 20, 21 తేదీల్లో గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ ఇ.అశోక్ కుమార్ తెలిపారు. స్థానిక హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పది ప్రాపర్టీ షోలు నిర్వహించామని, ఇది 11వదని పేర్కొన్నారు. అగనంపూడి నుంచి తగరపువలస వరకు విశాఖ నగరం విస్తరించి ఉందని, ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు అన్నీ తిరిగి చూడడం కష్టం కాబట్టి ఒకే వేదికపైకి వాటిని తీసుకువచ్చి కొనుగోలుదారులకు వివరాలను అందుబాటులో ఉంచడమే ఈ షో ప్రధాన ఉద్దేశమన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు వస్తున్నాయని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావస్తున్నదని, పెట్టుబడులకు విశాఖ మంచి ప్రాంతమని చైర్మన్ ధర్మేందర్ పేర్కొన్నారు. పర్యావరణ హితంగా ఎలాంటి ప్రాజెక్ట్‌లు వస్తున్నాయో ఈ షో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. గౌరవ కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఫ్లాట్ల కొనుగోలుదారులకు 5 శాతం వరకు ధరలు తగ్గే అవకాశం ఉందని, సిమెంట్ కంపెనీలు 10 శాతం జీఎస్టీని పూర్తిగా తగ్గిస్తే ధరలు కొంతమేరకు అందుబాటులో ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. ఎక్స్‌పో కన్వీనర్ గోవిందరాజు మాట్లాడుతూ మొత్తం 72 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనికి ప్రవేశ రుసుము లేదని, ప్రతి గంటకు లక్కీడ్రా తీసి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార-2** : మెలోడీ, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతుధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

31 వరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 31 వరకు విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18526/18525), విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22820/22819), విశాఖ-కొరాపుట్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18512/18511), విశాఖ-రాయపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58528/58527), విశాఖ-కొరాపుట్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58538/58537), విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58532/58531), విశాఖ-భవానీపట్న-విశాఖ పాసింజర్ రైళ్లకు (58504/58503) రెండేసి జనరల్ సీటింగ్ కోచ్‌లు, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఒక స్లీపర్ క్లాసు, ఒక జనరల్ సీటింగ్ కోచ్‌లు జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈశ్వరరావు కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ

కంచరపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ రోజు విద్యుత్ తీగ తెగిపడి మృతిచెందిన గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బత్తిన ఈశ్వరరావు కుటుంబ సభ్యులను 55వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ శనివారం పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపించిన బాధిత కుటుంబ సభ్యులను వార్డు కమిటీ సభ్యులు ఓదార్చారు. రంజీత్ మాట్లాడుతూ ఎంపీ భరత్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుల దృష్టికి తీసుకెళ్లి ఈశ్వర్రావు కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం చేస్తామన్నారు. టీ దుకాణం నడపడం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో ఇంటి పెద్ద దిక్కు ఈశ్వర్రావు మృతి చెందడంతో ఆధారం లేకుండాపోయింది. ఈ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు పిల్లల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, ఎస్.రమణ అప్పారావు, కోటి, వెంకటరావు, యమున, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

'ఎండాడలోనే యాదవ సంఘం భవనం నిర్మించాలి'

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎండాడలో తమకు కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం సహకరించాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అలసి అప్పలనారాయణ డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.యాదవ సంఘానికి మరోచోట స్థలం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసిందని, ఈ ఆలోచన విరమించుకుని భవన నిర్మాణానికి యాదవ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి యాదవుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఐక్యవేదిక నాయకులు కోరందాసు మోహన్‌రావు, అల్లురమణ మాట్లాడుతూ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌యాదవ్, అనుపమ యాదవ్, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు పాల్గొన్నారు.

'నిరసనలో పాల్గొనం'

సీతమ్మధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఈ నెల 6 నుంచి దశలవారీగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం సభ్యులు ఎవరూ పాల్గొనబోరని ఈ విభాగం విద్యుత్ కార్మిక సంఘం డిస్కం అధ్యక్షుడు బి.ఎం. నాయుడు స్పష్టంచేశారు. తమ సభ్యులు అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నందున ప్రజల అవసరాలు, విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

డీజే సౌండ్ బాక్స్‌లు సీజ్

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న డీజే సౌండ్‌బాక్స్‌లను టూటౌన్ పోలీసులు సీజ్ చేశారు. రాష్ట్రంలో వీటి వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కన్నయ్యపేటలో ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా వీటిని వినియోగించరాదని, డీజే సౌండ్ శబ్దం కూడా 50 డిజిబులిటీ లోపలే ఉండాలని స్పష్టంచేశారు.

ఇంకా పాత ధరలే!

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో పరిశీలించగా, హోల్‌సేల్ అండ్ రిటైల్‌గా మందులు విక్రయించే గుప్తా మెడికల్స్‌లో దీనిపై ప్రత్యేకంగా బోర్డు పెట్టారు. దానికి సమీపంలోనే ఉన్న మెడిప్లస్ మందుల దుకాణంలో మాత్రం జీఎస్టీకి సంబంధించిన బోర్డు లేదు. వారి దగ్గర జనరిక్ మందులు కొంటే 50 శాతం నుంచి 80 శాతం తక్కువకు వస్తాయని, సిబ్బంది కావాలనే బోర్డులు మాత్రం ప్రదర్శించారు. ఇలా బోర్డులు ప్రదర్శించని దుకాణాలు చాలా ఉన్నాయి. అదేవిధంగా రెగ్యులర్‌గా ఇళ్లల్లో వాడే సబ్బులు, టూత్‌పేస్టులు, పౌడర్లు, నూనెలు, వాషింగ్ లిక్విడ్, పప్పు దినుసులపై ఏ మేరకు రేట్లు తగ్గాయనేది ఆయా షాపుల్లో బోర్డులు పెట్టించాలి. ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం నిర్వహించడం అంటే అది. కొందరు అధికారులు 'క్యూఆర్ కోడ్' ఇచ్చి దానిని స్కాన్ చేస్తే జీఎస్టీ ఎంత తగ్గుతుందో తెలుస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఆ కోడ్ స్కాన్ చేస్తే జీఎస్టీ క్యాలిక్యులేటర్ వస్తోంది. దాంతో ఏమి చేయాలో ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రతిచోట బోర్డులు పెట్టినప్పుడే తేడా తెలుస్తుంది.

ఆటో డ్రైవర్లలో వెల్లివిరిసిన సంతోషం



ఆర్టీఓ మంగాదేవితో కలసి సాయాన్ని అందజేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



చెక్కు ప్రదర్శిస్తున్న టీడీపీ నేత గండి.బాబ్జీ, రవాణా శాఖ అధికారులు



ఆటో కార్మికులతో దక్షిణ నియోజకవర్గ టీడీపీ నేత సీతంరాజు సుధాకర్

మాధవధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద సాయం ఎవరికైనా అందకపోతే, వార్డు, గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని రవాణా శాఖ అధికారులు సూచించారు. అర్హులైన ఆటో, మోటార్ క్యాబ్, మాక్సీ క్యాబ్ వాహన యజమానులకు రూ.15 వేల చొప్పున సాయం అందించామన్నారు. ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద జిల్లాలోని 22,955 మందికి రూ.34,43,25,000 విడుదల చేసినట్లు రవాణా శాఖ కార్యాలయ ఇంచార్జి డీటీసీ ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు నగదు చెక్కులను శనివారం అధికారికంగా అందజేశారు. విశాఖ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, కోరాడ రాజబాబు, రవాణా శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సాయం జమ చేసినట్లు తెలిపారు.

ఉత్తర నియోజకవర్గంలో..

విశాఖ ఉత్తరం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో ఆర్టీఓ మంగాదేవి, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోన్-5 జెడ్సీ బి.రాము తదితరులు సాయాన్ని అందజేశారు. నియోజకవర్గంలో 2,562 మందికి రూ.3.84 కోట్ల సాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. మాధవస్వామి కల్యాణ మండపంలో ఆటో కార్మికుల సందడి వాతావరణం మధ్య ఈ కార్యక్రమం జరిగింది.

దక్షిణ నియోజకవర్గంలో..

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో 1,927 మంది ఆటో డ్రైవర్లు లబ్ధి పొందారని దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తెలిపారు. శనివారం ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేల వంతున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయటంతో దక్షిణ నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లలో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ ఆటో డ్రైవర్లతో కలసి సంతోషాన్ని పంచుకున్నారు. ఆయన స్వయంగా ఖాకీ చొక్కా వేసుకొని, ఆటో నడిపారు. సూపర్ సిక్స్‌లో లేని పథకాన్ని సైతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని సుధాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లు ప్రయోజనం పొందారని తెలిపారు. ఇది ఆటో డ్రైవర్లకు దసరా కానుక అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీడీసీఏ వార్షిక లీగ్ విజేతలకు ట్రోఫీల బహూకరణ



సిటీ పోలీసుకు ట్రోఫీ అందిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీడీసీఏ ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) నిర్వహించిన వార్షిక లీగ్ టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు శనివారం ట్రోఫీలు బహూకరించారు. శనివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు కె.పార్థసారథి, డి.ఎస్.వర్మ, ఎస్ఎస్ఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: తొలి డివిజన్‌లో ఇస్పాత్ సీసీ, మెట్రో సీసీ; 2వ డివిజన్‌లో వైజాగ్ వెటరన్స్, వైజాగ్ కోల్ట్స్; 3వ డివిజన్‌లో ఉషోదయ సీసీ, 4వ డివిజన్‌లో మెజిస్టిక్ సీసీ, గౌరీ యూత్ సీసీ; 5వ డివిజన్‌లో పెంటమాంబ సీసీ, కోల్ట్స్ సీసీ; 6వ డివిజన్‌లో ఆశరాయ సీసీ, శ్రీగణేష్ సీసీ విన్నర్, రన్నర్‌ప్‌గా నిలవగా ఇనిస్టిట్యూషనల్ కేటగిరిలో సిటీ పోలీసు, ఏపీఈపీడీసీఎల్ జట్లు విన్నర్, రన్నరప్ స్థానాలను సాధించాయి.

తొలి డివిజన్ విభాగంలో ఉత్తమ ఆల్‌రౌండర్‌గా రైల్వేస్ ఆటగాడు ఎంఎస్.దీప్ నిలిచాడు. తొమ్మిది మ్యాచ్‌లలో దీపక్ 430 పరుగులు చేయడంతోపాటు 13 వికెట్లు పడగొట్టాడు. మిగిలిన డివిజన్లలో సయీర్ జోగి (సోలోస్), పి.వంశీనారాయణ (వీసీసీ), వి.కె.సిద్దార్థ్ (మెజిస్టిక్), ఎం.అవినాష్ (కోల్ట్స్), జస్వీర్ సింగ్ (ఎన్ఏడీ), టి.అభిషేక్ (ఏపీఈపీడీసీఎల్) ఉత్తమ ఆల్‌రౌండర్ అవార్డులు అందుకున్నారు. వీరితోపాటు డివిజన్ల వారీగా ఉత్తమ బ్యాట్స్‌మేన్, ఉత్తమ బౌలర్ అవార్డులనందజేశారు.

సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి

సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు



గీతాలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఘన చరిత్ర కలిగిన మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం పురస్కరించుకుని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెలోడీ సాంస్కృతిక వైభవం, నటరత్న యువతర సినీ సంగీత విభావరిని శనివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వంకాయల సన్యాసిరాజు, వీవీ రమణమూర్తి, మట్టపల్లి హనుమంతరావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక వైభవానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆనందకరమని జీఎస్ఎన్ రాజు అన్నారు. సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, కదలి, ఎస్.విజయకుమార్, సీహెచ్ చిట్టిబాబు, కొణతాల రాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, ఉష చీరాలు, కె.అరుణకాంత మాట్లాడారు. యువరత్న, నటరత్న నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు వీరస్వామి, సత్యనారాయణ, ప్రభాకర్, మాధవ్, పుండరీకుమార్, రాము, అభినయ్, ప్రసాద్, జ్యోతి, లక్ష్మీసాత్విక, రంజిత, ప్రణవి, హర్షితలు, ఎన్టీఆర్, బాలకృష్ణ నటించిన సినిమాల్లోని గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి సోమేష్ బృందం సంగీత వాద్య సహకారం అందించగా, లక్ష్మీస్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

మన్యం జిల్లాలో హాస్టల్ విద్యార్థినులకు పచ్చకామెర్లు

▸ కేజీహెచ్‌కు 22 మంది తరలింపు ▸ ప్రత్యేక వార్డులో చికిత్స

మహారాణిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట ఏపీఎస్‌టీడబ్ల్యూ హాస్టల్‌కు చెందిన 22 మంది విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. తొలుత ఈ నెల మూడో తేదీన ముగ్గురు విద్యార్థినులు రాగా, శనివారం మరో 19 మంది వచ్చారు. ఇంకో ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువస్తున్నట్టు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం శివన్నపేట ఏపీఎస్‌టీడబ్ల్యూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షలు చేయించగా 24 మందికి పచ్చకామెర్లుగా తేలింది. దీంతో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం వారిలోని 22 మందిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. ప్రత్యేక వార్డులో గ్యాస్ట్రో పిడియాట్రిక్ జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రయాణికుల ద్వారా రూ.426 కోట్ల ఆదాయం

... 5వ పేజీ తరువాయి

21.69 శాతం అధికం. ● ర్యాక్‌ల టర్న్ అరౌండ్ సామర్థ్యం పెరిగింది. గతంలో రోజుకు 53.8 ర్యాక్‌లకు సరకులు లోడింగ్ కాగా ఇప్పుడు 59.6 ర్యాక్‌లు చేస్తున్నారు. ● గతంలో ఐరన్‌ఓర్ రవాణా ద్వారా రూ.662.92 కోట్ల ఆదాయం రాగా ఈసారి అది రూ.800 కోట్లకు చేరింది. ● సెప్టెంబరు చివరి నాటికి 1.64 కోట్ల ప్రయాణికులు రైళ్ల ద్వారా గమ్యం చేరారు. ● డివిజన్‌లో నార్కోటిక్ డ్రగ్స్ కేసులు 121 నమోదు చేసి రూ.2.86 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ● స్టేషన్ల ఆవరణను దుర్వినియోగం చేసినందుకు 30 వేల మందిపై కేసులు నమోదు చేశారు. ● రైళ్ల పైకి రాళ్లు విసిరే వారికి సంబంధించి గత ఏడాది 28 కేసులు నమోదు కాగా స్థానిక నాయకులతో చర్చలు జరపడం వల్ల ఈ ఘటనల సంఖ్య ఐదుకు చేరింది. ● పిల్లల అక్రమ రవాణాను నిరోధించి 273 మంది బాలలను, 69 మంది బాలికలను సంబంధీకులకు అప్పగించారు....

సమస్యల పరిష్కారానికి సృజనాత్మక ఆలోచనలు అవసరం

ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుఘీసు

సీతమ్మధార, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధకులను ప్రేరేపిస్తూ సమాజ సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుఘీసు సూచించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ హ్యాకథాన్ నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ (2025)ను ప్రాజ్ఞా రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. లెర్న్, లాంచ్, లీడ్ అంశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అబ్రహం వరుఘీసు మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ రెండు రోజులు గ్లోబల్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని, 30 కళాశాలల నుంచి 360 మంది విద్యార్థులు 55 బృందాలుగా పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన నాసా స్పేస్ యాప్స్ చాలెంజ్ ప్రతినిధిగా లోకల్ లీడ్‌గా సీహెచ్ వెంకట్‌ను నియమించారని, కళాశాల నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డి.భుజంగరావు పర్యవేక్షణలో విద్యార్థులు ప్రాజెక్ట్‌లను తయారు చేస్తారన్నారు. వీటిని నాసా పరిశీలించి న్యాయ నిర్ణేతలతో ప్రథమ స్థానాన్ని నిర్ధరిస్తారని మధుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌బీసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. కర్ణాటకలోని బెళగావిలో రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరగనున్న ఈ టోర్నీలో ఏయూ జట్టుకు వి.మహేష్, జి.జనార్థన్, డి.దుర్గాప్రసాద్, బి.రాకేష్, ఎన్.కనకరాజు, ఎల్.కైలాష్, టి.మణికంఠ, బి.హేమంత్‌కుమార్, ఎస్.సాయి, వి.సాయి గణేష్, కె.ప్రభాకరరావు, పి.పృథ్వీరాజు, ఎం.దినేష్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. కోచ్‌గా ఎస్.రాజేష్ వ్యవహరిస్తారని ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు. జట్టు సభ్యులను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు అభినందించి పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఐఏపీ స్పోర్ట్సు ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్‌కు నగర వాసి



మూగు సురేశ్ రెడ్డి

సింధియా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌లో జరగనున్న 2వ ఆసియా అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ భారత టీ 10 టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టుకు 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి మూగు సురేశ్ రెడ్డి (20) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసు నుంచే క్రీడల పట్ల అమితమైన ఆసక్తి, నిత్యం సాధన చేయడం వల్ల ఈ అవకాశం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆంధ్రప్రదేశ్ టీ 10 క్రికెట్ అసోసియేషన్ పీడీ సుకుమార్, రాంబాబు తదితరులు సురేశ్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఫ్లాట్ల ధరలు దిగొచ్చేనా?

5వ పేజీ తరువాయి

తగ్గాయి. కానీ బిల్డర్లు తగ్గలేదని చెప్పడం గమనార్హం. ఇక స్టీల్ రేట్లు చూసుకుంటే వైజాగ్ స్టీల్ టన్ను రూ.54 వేలకు దొరుకుతోంది. గతంలో ఇదే స్టీల్ టన్ను రూ.90 వేలు పలికింది. అంటే ఎంత తేడా ఉందో అర్థం చేసుకోవచ్చు. సింహాద్రి స్టీల్ టన్ను రూ.53 వేలకు దొరుకుతోంది. ఈ ప్రయోజనం కొనుగోలుదారులకు అందడం లేదు.

ఏదేమైనా స్టీల్, సిమెంట్ ధరలు బాగా తగ్గినందున బిల్డర్లు ఆ మేరకు ఫ్లాట్ల ధరలను తగ్గించాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రేట్లు ఎక్కువైనపుడు ఎలా పెంచుతున్నారో తగ్గినప్పుడు కూడా ఆ ప్రయోజనం కొనుగోలుదారులకు అందిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ రంగంలోనే వైద్యవిద్య కొనసాగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య చలం

డాబాగార్డెన్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైద్య కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక, పీపుల్ ఫర్ ఇండియా, విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ వైద్య విద్యా కళాశాలలు, ప్రజారోగ్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ చలం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య విద్యను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన ధనాన్ని ప్రైవేట్ వారికి అతిచౌకగా కట్టబెట్టే పీపీపీ విధానం వైద్య రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడంలో భాగమని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ సంపద సృష్టిస్తాననే నినాదంతో ముందుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ ప్రజల సంపదను ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. దీని వలన డబ్బున్నవాళ్లే చదువుకునే పరిస్థితి ఉంటుందన్నారు. ఆర్థికభారంతో పాటు ప్రతిభ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రజా ఆరోగ్యవేదిక అధ్యక్షుడు టి.కామేశ్వరరావు, ఐసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరి, వరప్రసాద్ మాట్లాడుతూ పీపీపీ విధానాన్ని విరమించి 10 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో డీవైఎఫ్ఐ రాజు, ఎస్ఎఫ్ఐ నాయుడు, అజయ్, ఐద్వా మాధవి, సాగర్, వసంత్, కుమార్, మణి, మేరీ, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

వలందపేటలో బాణసంచా పేలుడు

▸ ముగ్గురికి తీవ్ర గాయాలు ▸ ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాకి మహేశ్, నగిరెడ్ల వాసు, చిల్ల కనకారెడ్డి



వలందపేటలో సంఘటన జరిగిన ప్రదేశం

తగరపువలస, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తగరపువలస సమీపంలోని వలందపేటలో శుక్రవారం రాత్రి బాణసంచా సామగ్రి పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు శనివారం అమ్మవారి ప్రతిమ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు బాకి మహేశ్, (35), నగిరెడ్ల వాసు (32), చిల్ల కనకారెడ్డి (26)లు శుక్రవారం రాత్రి అమ్మవారి మండపానికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో బాణసంచా తయారీకి సిద్ధమయ్యారు. అనాలోచితంగా ముడి సరకులను కలిపి ఖాళీ బాటిల్‌తో నింపుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలో ఉన్న ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో సీఐ తిరుమలరావు, ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శనివారం క్లూస్ టీమ్ కూడా ఆధారాలు సేకరించింది. కాగా క్షతగాత్రుల్లో మహేశ్ పరిస్థితి విషమంగా ఉంది. మహేశ్, వాసు ప్లంబర్లుగా, కనకారెడ్డి తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. సీఐ తిరుమలరావు మాట్లాడుతూ బాధితుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

తొలి 20 ప్లాట్లకే అప్‌సెట్ ధర రూ.23,500

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాపులుప్పాడలో వీఎంఆర్‌డీఏ కొత్తగా వేసిన లేఅవుట్‌లో ప్లాట్లను వేలం ద్వారానే కేటాయిస్తామని కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. తొలి 20 ప్లాట్లకు అప్‌సెట్ ధర గజం రూ.23,500 నుంచి వేలం ప్రారంభిస్తామని, వేలం లేకుండా ఎవరికీ ప్లాట్లు కేటాయించే అవకాశం లేదన్నారు. ఆ తరువాత నిర్వహించే వేలంలో ఈ అప్‌సెట్ ధర పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో...కూటమి ప్రభుత్వం

... 5వ పేజీ తరువాయి

మధ్యకాలంలో తమ ప్రభుత్వం ఆటోలకు లైఫ్ ట్యాక్స్‌ను మినహాయిస్తే, ఇప్పుడు అధికారంలోకి రాగానే గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేసిందన్నారు. ఆటోడ్రైవర్లకు ఏమైనా సమస్యలు ఉన్నట్టయితే తమకు తెలిపితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ పథకంలో అర్హులైన వారికి డబ్బులు అందకపోతే వార్డు, గ్రామ సచివాలయాన్ని సంప్రతిస్తే ప్రభుత్వం పరిశీలించి తగినచర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాల అమలుకు వెనకడుగు వేయకుండా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నగర అభివృద్ధికి కొత్తపెట్టుబడులను తీసుకొస్తోందన్నారు. రాబోయే రోజుల్లో టీసీఎస్ వంటి కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించబోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు శ్రీధర్, రాంబాబు మాట్లాడుతూ ఈ మొత్తం తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయంటూ ఉద్విగ్నతకు గురయ్యారు. ప్రభుత్వం తమ పట్ల చూపిన ఆప్యాయతను మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లకు చెక్కును మంత్రి, ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేసారు. అంతకుముందు సర్క్యూట్‌హౌస్ నుంచి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే వెలగపూడి, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆటోలో ప్రయాణించి సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌కు చేరుకున్నారు.

జీవీఎంసీలో వెండింగ్ జోన్లు

... 5వ పేజీ తరువాయి

మల్కాపురం గాంధీనగర్ మార్కెట్‌లో 100, 104 ఏరియాలో 60, ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు రోడ్డులో 14, జింక్ గేటు జంక్షన్ వద్ద 29, దువ్వాడ ఫ్లైఓవర్ కింద 24, ఎన్ఏడీ జంక్షన్‌లో 10, బాజి జంక్షన్‌లో 5, గోశాల జంక్షన్‌లో 10, అడవివరం జంక్షన్‌లో 10, వేపగుంట జంక్షన్‌లో 15, పెందుర్తిలో 30 మొత్తం 649 దుకాణాల ఏర్పాటుకు స్థలం (వెండింగ్ జోన్) అందుబాటులో ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. దీనికి జిల్లా కలెక్టర్ ఆమోదం తెలపడంతో ఆయా ప్రాంతాల్లో స్ట్రీట్ వెండింగ్ జోన్ ఏర్పాటును ఖరారు చేస్తూ జీవీఎంసీ అధికారులు గెజిట్ జారీచేశారు.

వీధి వర్తకుల సర్వే పూర్తి

నగరంలో వీధి వర్తకులను గుర్తించేందుకు యూసీడీ ఆధ్వర్యంలో ఇటీవల సర్వే పూర్తయింది. ఎనిమిది జోన్‌ల పరిధిలో 18,041 మంది వ్యాపారులను గుర్తించారు. జోన్-1 పరిధిలో 217 మంది, జోన్-2 పరిధిలో 2,965 మంది, జోన్-3 పరిధిలో 3,615, జోన్-4 పరిధిలో 2,879, జోన్-5 పరిధిలో 3,510, జోన్-6 పరిధిలో 2,152 మంది, జోన్-7 పరిధిలో 154 మంది, జోన్-8 పరిధిలో 2,549 మంది వీధి వర్తకులు ఉన్నారు. జీవీఎంసీ నోటిఫైడ్ వీధి వర్తకుడిగా గుర్తింపు పొందాలంటే యూసీడీ విభాగానికి రూ.200 చెల్లించి గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది. అయితే అలాంటివారు జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 6,755 మంది మాత్రమే ఉన్నారు. గుర్తింపు కార్డు పొందినవారు తాము సొంతంగా దుకాణం పెట్టుకుని వ్యాపారం చేసుకోవాల్సి ఉన్నప్పటికీ తమకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుర్తింపుకార్డులు ఉన్నవారితోపాటు ఇటీవల దుకాణాలను కోల్పోయిన వారిని యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మరోసారి సర్వే చేస్తున్నారు. ఎవరైతే వాస్తవంగా ఆ దుకాణంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారో వారికి సమీపంలోని స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో దుకాణం ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు సహాయాన్ని కూడా జీవీఎంసీ ద్వారా అందజేయాలని అధికారులు నిర్ణయించారు. వీలైనంత త్వరగా స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు ప్రారంభించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

జడ్పీలో రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ఫోన్ చేసి 'జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు రాకపోవడానికి మీ నిర్లక్ష్యమే కారణం' అంటూ వ్యాఖ్యానించడంతో పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలోనే ఉన్న విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రధానంగా కలెక్టర్లకు ప్రభుత్వ కార్యక్రమం తొలి ప్రాధాన్యం, జడ్పీ సమావేశం రెండో ప్రాధాన్యం అంటూ జడ్పీ సమావేశం వాయిదా వేసుకుని ఉండాల్సిందని పేర్కొనడం గమనార్హం. కాగా అల్లూరి జిల్లా అనంతగిరిలో రెండు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వంలోనే వచ్చాయి. వాటిపై అప్పట్లో మౌనంగా ఉన్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటని సమావేశంలో సభ్యుడొకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే వైసీపీ హయాంలో జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక రోడ్లను బాగుచేయించింది. కానీ ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విమర్శలు చేయడంతో రాజకీయ లబ్ధికోసమేననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక, ఒక్క అంశాన్ని పట్టుకుని గంటల తరబడి సాగదీస్తున్నారు. ఇదే విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ శనివారం ప్రస్తావించి అన్ని అంశాలకు సమయం కేటాయించాలన్నారు. సమావేశం మధ్యలో ఆయన వెళ్లిపోయిన తరువాత సమస్యలను పక్కనపెట్టి ప్రొటోకాల్ అంశంపై సభ్యులు చర్చించడం గందరగోళానికి దారితీసింది. ప్రతి అంశానికి నిర్దిష్ట సమయం నిర్ణయించి చర్చించేలా అధ్యక్ష స్థానంలో ఉన్న ఛైర్‌పర్సన్ చూడాలి. గడచిన నాలుగేళ్లలో అసలు చర్చకు రాని శాఖలే ఎక్కువగా ఉన్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆదేశిస్తారు. దీంతో రోజంతా వారు జడ్పీలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. శనివారం సమావేశాలకు హాజరుకాని అధికారులను జడ్పీ అధికారులు ఆగమేఘాలపై పిలిపించారు. వారికి సంబంధించిన శాఖలపై చర్చ చేపట్టారా?...అంటే అదీ లేదు.



గాజువాకలో జరిగిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు



ఎన్ఏడీలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న పి.గణబాబు

ఆటో కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- 'ఆటో డ్రైవర్ల సేవలో' ద్వారా గాజువాక నియోజకవర్గంలో 3,283 మందికి లబ్ధి

గాజువాక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవ'లో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆటోలు, ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తూ సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆటో కార్మికులకు మరిన్ని సంక్షేమ పథకాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఆటో కార్మికులు కోసం ప్రత్యేకంగా ఓ బోర్డును కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వైసీపీ హయాంలో ఆటో కార్మికులకు చేసిందేమీ లేదని, పైగా వేధింపులు ఎక్కువగా ఉండేవన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో ఆనందం చూడాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్టీవో జయప్రకాశ్ మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో 3,283 మంది లబ్ధిదారులను ఈ పథకం కింద గుర్తించామని, వారికి రూ.4.9 కోట్లకు పైగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందన్నారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో నడిపిన 'పల్లా'

'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో పాల్గొనేందుకు పాత గాజువాక కూడలి నుంచి జగ్గు జంక్షన్ వద్దనున్న శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం వరకూ పల్లా శ్రీనివాసరావు స్వయంగా ఆటో నడుపుకుంటూ ర్యాలీగా వచ్చారు. సభ అనంతరం ఆటో డ్రైవర్లకు చెక్కులు పంపిణీ చేశారు.

'పశ్చిమ'లో 2,212 మంది లబ్ధిదారులకు రూ.3.32 కోట్లు

ఎన్.ఎ.డి.జంక్షన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు.

ఎన్ఏడీలో జరిగిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గం నుంచి ఎంపిక చేసిన 2,212 మంది లబ్ధిదారులకు రూ.3.32 కోట్లను పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఏడాదిన్నరలోనే ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. అంతకుముందు ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీగా గణబాబు సభాస్థలికి చేరుకున్నారు. కార్యక్రమంలో జోన్-8 జడ్సీ హెచ్ శంకరరావు, కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్, వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మన్మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అంగ ప్రశాంతి, కూటమి నాయకులు వైటీఆర్, శరగడం అరుణ్‌కుమార్, నరవ పైడిరాజు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్వచ్ఛ ఆస్పత్రిగా కణితి పీహెచ్‌సీ



కణితి ప్రాథమిక వైద్య కేంద్రం

కూర్మన్నపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశయాలను సఫలం చేస్తూ, పరిశుభ్రతకు అగ్రపీఠం వేసిన కణితి ప్రాథమిక వైద్య కేంద్రానికి జిల్లా స్థాయిలో స్వచ్ఛ అవార్డు దక్కింది. కణితి పీహెచ్‌సీలో వైద్యులు ఇందు, కళావతి, బాబీల పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆసుపత్రిలోనే కాకుండా ఆ పరిసరాల్లో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడానికి పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

ఈపీడీసీఎల్ ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి. అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన జూనియర్ అకౌంటెంట్ బీశెట్టి కోటేశ్వరరావును, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమరాన శ్రీనివాసరావును కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఏడీ దాసరి శిక శంకర ప్రసాద్‌లు వారిని సన్మానించి మాట్లాడారు. క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ లక్ష్మణరావు, జేఈ తేజేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

గాజువాక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలుష్యభరిత సిమెంటు ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితిల్లోనూ గంగవరం పోర్టు సమీపంలో ఏర్పాటు చేయనివ్వమని, ప్రజల నిర్ణయాన్ని కాదని ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తామని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు హెచ్చరించారు. అదానీ సిమెంటు ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ గాజువాక క్లబ్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వ నివాస్, వాయిస్ఆఫ్ గాజువాక తదితర సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. గంగవరం పోర్టులో కాలుష్యం వల్ల గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజలు తీవ్రకాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితిల్లో సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇప్పటికే కాలుష్యం వల్ల ప్రజలు గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు 8న జరగనున్న పబ్లిక్ హియరింగ్‌ను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజలతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, హక్కుల సాధన కోసం, ప్రభుత్వ రంగ సంస్థలకు కాపాడుకునేందుకు పోరాటాలు ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛాంధ్ర అవార్డు



షిప్‌యార్డు కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల

మల్కాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలం షిప్‌యార్డు కాలనీలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర 2025 అవార్డు లభించినట్టు జీవీఎంసీ కమిషనర్ శనివారం అధికారికంగా ప్రకటించారని ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనం, నీటి వినియోగం, నీటి సంరక్షణ, చేతులు శుభ్రపరచడం, పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల యాజమాన్యం (వేస్ట్ మేనేజ్‌మెంట్) వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పరిశుభ్రత కార్యక్రమానికి ప్రత్యేకంగా సమయం కేటాయించిన ఫలితమే ఈ అవార్డు అని అన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): యువతితో ఉన్నప్పుడు ప్రశ్నించిన వృద్ధుడిపై స్నేహితులతో కలిసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సాధుమఠం సమీపం బాపూజీనగర్‌కి చెందిన వృద్ధుడు బసవబోయిన దేవుడు (60) ఈ నెల 2న మేకలను మేతకు తీసుకువెళ్లినప్పుడు నిర్జీవ ప్రదేశంలో కరకవానిపాలేనికి చెందిన చుక్కా జగదీశ్ (23) ఓ యువతితో కనిపించాడు. జన సంచారం లేనిచోట ఎందుకు ఉన్నారని, అక్కడనుంచి వెళ్లిపోవాలని చెప్పాడు.

దీంతో కోపోద్రిక్తుడైన జగదీశ్ శుక్రవారం తన స్నేహితులైన కొత్తవలసకు చెందిన లెంక సాయికుమార్ (22), పెందుర్తి ద్రోణంరాజునగర్‌కు చెందిన యాండ్రపు మహేశ్(22)లతో కలిసి మేకల మేత కోసం వచ్చిన దేవుడిపై కత్తి, కర్రలతో దాడికి పాల్పడ్డారు. తనను చంపేస్తారన్న భయంతో దేవుడు వారినుంచి తప్పించుకుని పారిపోయి పొదల్లో దాక్కోవడంతో ఆ యువకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి జగదీశ్, మహేశ్, సాయికుమార్‌లను అరెస్టు చేశారు.

డిసెంబరు 19 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్. చిత్రంలో చైర్మన్ ధర్మేందర్, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా విశాఖపట్నంలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను డిసెంబరు 19, 20, 21 తేదీల్లో గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ ఈ.అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పది ప్రాపర్టీ షోలు నిర్వహించామని, ఇది 11వదని పేర్కొన్నారు. అగనంపూడి నుంచి తగరపువలస వరకు విశాఖ నగరం విస్తరించి ఉందని, ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు అన్నీ తిరిగి చూడడం కష్టం కాబట్టి ఒకే వేదికపైకి వాటిని తీసుకువచ్చి కొనుగోలుదారులకు వివరాలను అందుబాటులో ఉంచడమే ఈ షో ప్రధాన ఉద్దేశమన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు వస్తున్నాయని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావస్తున్నదని, పెట్టుబడులకు విశాఖ మంచి ప్రాంతమని చైర్మన్ ధర్మేందర్ పేర్కొన్నారు. పర్యావరణ హితంగా ఎలాంటి ప్రాజెక్టులు వస్తున్నాయో ఈ షో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. గౌరవ కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఫ్లాట్ల కొనుగోలుదారులకు 5 శాతం వరకు ధరలు తగ్గే అవకాశం ఉందని, సిమెంట్ కంపెనీలు 10 శాతం జీఎస్టీని పూర్తిగా తగ్గిస్తే ధరలు కొంతమేరకు అందుబాటులో ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. ఎక్స్‌పో కన్వీనర్ గోవిందరాజు మాట్లాడుతూ మొత్తం 72 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనికి ప్రవేశ రుసుము లేదని, ప్రతి గంటకు లక్కీ డ్రా తీసి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

పెందుర్తిలో పోలీసుల కార్డన్ సెర్చ్

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రించేందుకు పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసుల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చినముషిడివాడ, పెందుర్తిల్లో తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బెల్ట్ షాపును తనిఖీ చేసి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి రైల్వే స్టేషన్‌లో నాకాబందీ చేపట్టారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ స్థానికులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమన్నారు. అనుమానితుల సంచారం, అనుమానిత వస్తువులపై నిఘా ఉంచి తమకు సమాచారం అందించాలని కోరారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో రుత్వికులు సుందరకాండ హవనం, గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.



జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

'మేహాద్రిగెడ్డ' నుంచి నీరు విడుదల

గోపాలపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు గత కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగడంతో జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా, జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతున్న క్రమంలో ప్రస్తుతం నీటిమట్టం 59.5లకు చేరింది. దీంతో రెండు రోజుల నుంచి రిజర్వాయర్ గేటు ఎత్తి 578 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటిమట్టం 58 అడుగులకు చేరేంత వరకు నీటి విడుదల కొనసాగుతుందని సిబ్బంది తెలిపారు.

3 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సింగ్ హోమ్, స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మూడు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను సదరు యాజమాన్యాల దరఖాస్తు మేరకు రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో రిజిస్ట్రేషన్ల రద్దుకు దరఖాస్తు చేశారని, వాటిని పరిశీలించి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అనుమతితో రద్దు చేశామన్నారు. రిజిస్ట్రేషన్లను రద్దు చేసిన వాటిలో గాజువాకలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్, శ్రీవిద్య స్కానింగ్ సెంటర్, తగరపువలసలోని తల్లీ పిల్లల హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

నేడు శ్రీలహరికృష్ణ అమృత మంజిరి గ్రంథావిష్కరణ

పెందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీలహరికృష్ణ ఉపదేశాలతో కూడిన దేశ వ్యాప్త ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఒకే దేవుడు..ఒకే దేశం' నినాదంతో శ్రీమన్నారాయణ, శ్రీలహరికృష్ణ ఆధ్యాత్మిక మనుజ్యోతి బృందం ఆధ్వర్యంలో పెందుర్తి ప్రశాంతినగర్‌లో గల పోర్టు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అమృతమంజిరి (అంకురం 2) ప్రేమ గల చేతుల నైపుణ్యం ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉరుకూటి అప్పారావు



ఉరుకూటి అప్పారావు

పెదగంట్యాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వవార్డు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉరుకూటి అప్పారావు నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, గాజువాక నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు సిఫార్సుల మేరకు వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య ఈ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని అప్పారావు పేర్కొన్నారు.

9న అవయవ దానంపై అవగాహన సదస్సు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అవయవ, శరీర దాత సంఘం ఈ నెల 9న స్టీల్‌ప్లాంట్ సీ భవన్‌లో అవయవ దానంపై 'మరణించినా జీవిద్దాం' అనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని సమన్వయకర్తలు ఈ.బుచ్చిరాజు, ఎంఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన చేయూత ఫౌండేషన్, ఉక్కు అధికారుల సంఘం, లయన్స్‌క్లబ్, మానవత ట్రస్టు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సర్వహిత ట్రస్టు, మానస వికాస వేదిక, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు.

శ్రీవారి గిరి ప్రదక్షిణ రేపు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి గిరిప్రదక్షిణను సోమవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు గిరి ప్రదక్షణ ప్రారంభమవుతుందని, ఇందులో పాల్గొనే భక్తులు టార్చిలైట్లు తీసుకురావాలన్నారు.

దేవీ నవరాత్రులు సంపూర్ణం

అగనంపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు గల్లవానిపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షురాలు గల్లా హనిత, మేడిశెట్టి విజయ్, గల్లా రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా అధికారి బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా అధికారిగా కె.మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అకౌంట్స్ అధికారిగా పనిచేసిన మోహనరావుకు డీడీగా పదోన్నతి కల్పించిన ఉన్నతాధికారులు విశాఖ జిల్లా ఖజానా అధికారిగా బదిలీ చేస్తూ నాలుగు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన మోహనరావుకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

- **కాంతార2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



వడ్లపూడిలో ఆటో డ్రైవర్లతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

ఆటోవాలాలకు అండగా 'ఆటో డ్రైవర్ల సేవలో'

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు అండగా 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని, ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలో శనివారం ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాలోల జమ అవుతుందని అన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆటోడ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, శ్రీను తదితరలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

జీఎస్టీ తగ్గింపుతో అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గి ప్రజలకు మేలు చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా దుకాణాలకు, ఇంటింటికి వెళ్లి జీఎస్టీపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటి అవసరాలకు ఉపయోగించే విద్యుత్‌పై యూనిట్‌కు 13 పైసలు తగ్గనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీఎస్టీ విధానంతో ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, స్థానికులు పాల్గొన్నారు.

'ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

పెదగంట్యాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి 8వ తేదీన జరగనున్న ప్రజాభిప్రాయసేకరణ సభను రద్దు చేయాలని ఇంటక్ కాంట్రాక్టు యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. 75వ వార్డు సీతానగరంలో శనివారం నిర్వహించిన అఖిల పక్ష నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ఇప్పటికే నిర్వాసిత కాలనీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటే అది చాలదన్నట్టు ఇప్పుడు సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు శ్రీముసరి శ్రీనివాసరావు, నమ్మి అప్పలనాయుడు, నమ్మి రమణ, చట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

గాజువాక, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంటు కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకుని ఉత్తీర్ణులైన వారికి న్యూఐటీఐలో 'కౌశల్ దీక్షిత్ సమారోహ్' సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ కేఎస్.శ్రీనివాసరావు, కార్పొరేటర్ బీనరసింహపాత్రుడు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐటీఐలో స్కిల్‌డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పొందారన్నారు. నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పొందేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.